# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 15-2-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 147 పేజీలు:6 వెల: రూ.1/-


## వరిపంటలో మొగిపురుగు, అగ్గితెగుళ్ళ నివారణకు చర్యలు తీసుకోవాలి

### –మెదక్ జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఆశాకుమారి

మెదక్, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో వరిపంటపై ప్రస్తుతం మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని... నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు తెలియజేస్తున్నామని మెదక్? జిల్లా వ్యవసాయాధికారిణి ఆశాకుమారి అన్నారు. మంగళవారం మెదక్? పట్టణంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆశాకుమారి మాట్లాడుతూ... చీడపీడలు ఆశించిన దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుతం మొగి పురుగు ఎక్కువగా వరిపంటపై ఆశిస్తోందని నివారణకు రైతులు అవసరమైన సస్యరణక్షణ చర్యలను తెలిపారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న వారు కర్టాఫ్ హైడ్రో క్లోరైడ్ మందును 400 గ్రాములు ఎకరానికి, క్లోరాంట్రిని పోల్ 60 మిల్లీ లీటర్లు ఎకరానికి పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే అగ్గి తెగులు నివారణకు ఐసొప్రోతయోలిన్ 320 మిల్లీ లీటర్లు ఎకరాకు, ట్రైసైక్లోజన్ 120 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాల్సిందిగా వ్యవసాయాధికారిణి ఆశాకుమారి వివరించారు. జిల్లాలోని రైతాంగం తప్పకుండా వ్యవసాయ అధికారులు సూచించిన మందులను మాత్రమే పిచికారి చేయాలని ఈ సందర్భంగా ఆశాకుమారి కోరారు.

## లాల్ దర్వాజ ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి : మంత్రి తలసాని



హైదరాబాద్, ఫిబ్రవరి 14:పాతబస్తీ లోని ప్రముఖ దేవాలయం లాల్ దర్వాజ ఆలయ అభివృద్ధికి స్థానికులు భాగస్వాములు కావాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు.

మంగళవారం మాసాబ్ ట్యాంక్ లోని తన కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ విస్తరణ కోసం సేకరించాల్సిన స్థలాల యజమానులు, ఎమ్మెల్యే బలాల తో కలిసి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాల్ దర్వాజ శ్రీ సింహవాహిని అమ్మవారి ఆలయ అభివృద్ధి కి స్థానిక ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

ఆలయం అభివృద్ధి కోసం ఆలయానికి ఆనుకొని ఉన్న కొన్ని నిర్మాణాలను సేకరిస్తున్నామని చెప్పారు. స్థలాలిచ్చే యజమానులకు ప్రభుత్వం తగిన పరిహారం అందిస్తుందని వెల్లడించారు. ఇందుకోసం ఇప్పటికే ప్రభుత్వం రూ. 9 కోట్లను విడుదల చేసిందన్నారు.

ఇప్పటికే ప్రతి సంవత్సరం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందుకు కమిటీ సభ్యులు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ సురేందర్, సభ్యులు రాజ్ కుమార్, బద్రినాద్, జగదీశ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఉచిత విద్యుత్ ఆపే ప్రసక్తే లేదు : మంత్రి జగదీశ్ రెడ్డి

సూర్యాపేట, ఫిబ్రవరి 14: పేద ప్రజలకు అందించే రాయితీ విద్యుత్‌పై కేంద్రం కుట్రలు చేస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి నిప్పులు చెరిగారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించడం కేంద్రానికి కంటగింపుగా మారిందని పేర్కొన్నారు. కేంద్రం ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఉచిత విద్యుత్ ఆపే ప్రసక్తే లేదని మంత్రి తేల్చిచెప్పారు.

రాయితీ విద్యుత్ చార్జీలను డిస్కంలకు ముందస్తుగా చెల్లించాలనే కేంద్రం నూతన విద్యుత్ విధానం మంత్రి జగదీష్ రెడ్డి తీవ్ర స్థాయిలో స్పందించారు. కేసీఆర్ ఉన్నంతవరకు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తాం అని స్పష్టం చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేటు పరం చేయడం కోసమే కేంద్రం ఎత్తులు వేస్తుందని ధ్వజమెత్తారు. అన్నం పెట్టే రైతుకు ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచడం కోసమే సబ్సిడీలు ఇస్తున్నామని చెప్పారు. కేంద్రం ఫ్యూడల్ ఆలోచనలతో పేదలకు తీవ్ర నష్టం వాటిల్లుందని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకే కేంద్రం దుర్మార్గమైన ఆలోచన చేస్తుందన్నారు. ఉచిత విద్యుత్ ఆపేది లేదన్నారు. కేంద్ర నూతన విద్యుత్ విధానాన్ని వ్యతిరేకిస్తాం అని మంత్రి స్పష్టం చేశారు.

## హిండెన్‌బర్గ్‌పై ఈడీ దాడులు చేయిస్తారా?: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 14:ఇండియాలోని బీబీసీ ఆఫీసులపై ఇవాళ ఐటీశాఖ సోదాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్‌లో స్పందించారు. ఆ దాడుల పట్ల ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. కొన్ని వారాల క్రితమే ప్రధాని మోదీపై బీబీసీలో డాక్యుమెంటరీ ప్రసారం అయ్యిందని, ఇప్పుడు భారత్‌లోని బీబీసీ ఆఫీసులపై ఐటీ దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఐటీ, సీబీఐ, ఈడీ లాంటి ఏజెన్సీలు నవ్వులపాలు అవుతున్నాయని, ఆ సంస్థలు బీజేపీ కీలుబొమ్మలుగా మారినట్లు కేటీఆర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించిన మంత్రి కేటీఆర్.. తర్వాత ఎటువంటి చర్యను తీసుకుంటారని అడిగారు. అదానీ స్టాక్స్‌పై నివేదిక ఇచ్చిన హిండెన్‌బర్గ్ సంస్థపై ఐటీ దాడి చేయిస్తారా అని ఆయన ప్రశ్నించారు. లేదంటే ఆ సంస్థనే టేకోవర్ చేసుకుంటారా అని ఆయన విమర్శించారు. బీబీసీపై ఐటీ రెయిడ్స్‌కు సంబంధించి వివిధ మీడియా సంస్థలు రాసిన కథనాలను తన ట్వీట్‌లో మంత్రి ట్యాగ్ చేశారు.

ముంబై, ఢిల్లీల్లో ఉన్న బీబీసీ కార్యాలయాల్లో ఇవాళ ఐటీ శాఖ తనిఖీలు జరుగుతున్నాయి. ఇంటర్నేషనల్ ట్యాక్సేషన్, ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్‌లో అక్రమాలు జరిగినట్లు బీబీసీపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీబీసీపై ఐటీశాఖ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కొన్ని వర్గాలు ద్వారా తెలిసింది.

ఢిల్లీలోని బీబీసీ ఆఫీసులో సుమారు 20 మంది అధికారులు సోదాల్లో పాల్గొన్నారు. ముంబైలో ఉన్న బీబీసీ స్టూడియోస్‌లో కూడా తనిఖీలు నిర్వహిస్తున్నారు. డాక్యుమెంట్లను సీజ్ చేశారు. జర్నలిస్టుల ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను లాగేసుకున్నారు. సర్వే కోసం ఆఫీసును సీల్ చేసినట్లు చెప్పారు. ఎటువంటి వివరాలను బయటకు వెల్లడించరాదు అని ఉద్యోగులకు ఆదేశించారు. బీబీసీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వద్ద ఉన్న బ్యాలెన్స్ షీట్, అకౌంట్ల వివరాలను సేకరిస్తున్నట్లు ఐటీశాఖ అధికారులు తెలిపారు.

ఢిల్లీ, ముంబైల్లో ఉన్న బీబీసీ ఆఫీసుల వద్ద ఐటీశాఖ అధికారులు ఉన్నారని బీబీసీ తన ట్విట్టర్‌లో తెలిపింది. ఐటీ అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నట్లు ఆ సంస్థ చెప్పింది. వీలైనంత త్వరగా ఆ సమస్యను పరిష్కరించనున్నట్లు బీబీసీ తన ట్వీట్‌లో వెల్లడించింది.

## హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ రద్దు.. ఆదేశాలు జారీ చేసిన సుప్రీంకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 14:హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇవ్వాల (మంగళవారం) ఆదేశాలు జారీచేసింది. ఈ క్రమంలో ఏకసభ్య కమిటీని కూడా నియమించింది. మాజీ జడ్జి లావు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీ ఉండనుంది. ఇకపై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వ్యవహారాలను ఈ కమిటీ చూసుకుంటుందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది..

## ముంబయి నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా : సీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్, ఫిబ్రవరి 14:ముంబయి నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా ఎక్కువ జరుగుతోందని నగర సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. పలు ముఠాలు యువతులకు మాదక ద్రవ్యాలు అలవాటు చేసి వారిపై లైంగిక దాడికి పాల్పడుతున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల వ్యవహారంలో గోవా పోలీసులు ఎలాంటి సాయం చేయలేదని పేర్కొన్నారు. ఆ రాష్ట్ర పోలీసుల సహకారంతో డ్రగ్స్ సరఫరాను అడ్డుకుంటామని సీపీ స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల ముఠాపై ముంబయి పోలీసులకు సమాచారమిచ్చామని తెలిపారు. ముంబయి పోలీసుల సాయంతో అక్కడ కూడా దాడులు నిర్వహిస్తామని చెప్పారు.

హైదరాబాద్ నగరంలో మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తూ విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. వారి నుంచి 204 గ్రాముల ఎండీఎంతో పాటు ఓ కారును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ముంబయిలో మాదక ద్రవ్యాలకు సంబంధించి మరో గ్యాంగ్‌ను అరెస్టు చేశామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నుంచి ముంబయికి గంజాయిని తరలిస్తుండగా వారిని పట్టుకున్నామన్నారు. వారి నుంచి 110 కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ కేసులో భార్యాభర్తలిద్దరూ పరారయ్యారని, వారి కోసం గాలిస్తున్నట్లు వివరించారు.

## బెంగళూరులో ఎయిరో ఇండియా 2023, 14వ ఎడిషన్‌ను ప్రారంభించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ఈరోజు బెంగళూరులోని యహలంకలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఎయిరో ఇండియా 2023, 14 వ ఎడిషన్ ను ప్రారంభించారు. ఎయిరో ఇండియా 2023 థీమ్, " ది రన్ వే టు ఎ బిలియన్ ఆపర్చునిటీస్". ఈ ఎయిరో ఇండియా ప్రదర్శనలో సుమారు 80 కి పైగా దేశాలు , 800 డిఫెన్స్ కంపెనీలు, ఇందులో 100 విదేశీ 700 స్వదేశీ కంపెనీలు పాల్గొంటున్నాయి. ప్రధానమంత్రి శ్రీనరేంద్ర మోదీ దార్శనికత అయిన మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్ కు అనుగుణంగా, ఈ ఈవెంట్,దేశీయ సాంకేతిక పరికరాలు, సాంకేతికత, విదేశీ భాగస్వామ్యం, విదేవీ కంపెనీలపై దృష్టిపెడుతుంది.

ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధానమంత్రి, నవ భారత దేశ సామర్థ్యానికి బెంగళూరు ఆకాశం ఒక గుర్తుగా నిలుస్తోందని అన్నారు. " ఆకాశం అంత ఎత్తుకు అందుకున్న ఈ విజయం నవభారత వాస్తవమని , ఇవాళ ఇండియా ఆకాశమంత విజయాన్ని సాధిస్తోందని, ఇంకా పైపైకి దూసుకుపోతున్నదని చెప్పారు.

ఇండియా సామర్థ్యం పెరుగుదలకు ఎయిరో ఇండియా 2023 ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి అన్నారు. వంద దేశాలు ఈ ఈవెంట్‌లో పాల్గొంటున్నాయంటే, ప్రపంచదేశాలకు ఇండియాపై గల విశ్వాసానికి ఇది నిదర్శనమని ఆయన అన్నారు. భారతదేశ ఎం.ఎస్.ఎం.ఇలు , స్టార్టప్ లతో పాటు 700 మంది ఎగ్జిబిటర్లు,ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలకు చెందిన వారు ఈ షోలో పాల్గొంటున్నారన్నారు. ఎయిరో ఇండియా థీమ్ అయిన , బిలియన్ అవకాశాలకు రన్ వే అంశంపై ప్రముఖంగా దృష్టిపెడుతూ, ప్రధానమంత్రి, రోజురోజుకూ ఆత్మనిర్భర్ భారత్ బలం పుంజుకుంటున్నదని అన్నారు.

రక్షణ మంత్రుల సదస్సు గురించి ప్రస్తావిస్తూ, సిఇఒ రౌండ్ టేబుల్‌ను ఈ సదస్సు సందర్భంగా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ రంగంలో క్రియాశీలంగా పాల్గొనడం ద్వారా ఎయిరో ఇండియా సామర్థ్యం పెరగుతుందని ప్రధానమంత్రి అన్నారు.

కర్ణాటకలో జరుగుతున్న ఎయిరో ఇండియా ప్రాధాన్యత గురించి ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి, కర్ణాటక , బారతదేశపు సాంకేతిక పురోగతికి హబ్‌గా ఉందని అన్నారు. ఇది కర్ణాటక యువతకు ఏవియేషన్ రంగంలో నూతన అవకాశాలను అందిస్తుందని ఆయన అన్నారు. రక్షణ రంగంలో తమ సాంకేతిక నైపుణ్యాలను దేశ రక్షణ రంగం బలోపేతానికి వినియోగించాల్సిందిగా ప్రధానమంత్రి కర్ణాటక యువతకు పిలుపునిచ్చారు.

దేశం నూతన ఆలోచనలతో ముందుకు కదులుతుంటే,నూతన దృక్పథంతో ముందుకు పోతుంటే, ఈ నూతన ఆలోచనలకు అనుగుణంగా వ్యవస్థకూడా మారడం ప్రారంభిస్తుందని " ప్రధానమంత్రి అన్నారు. ఒకప్పుడు ఎయిరో ఇండియా ఒక షో మాత్రమేనని, ఇండియాకు అమ్మకాలకు సంబంధించినదిగా ఉండేదని , అయితే ఇప్పుడు ఈ ఆలోచనా ధోరణి మారిందని అన్నారు. "ఇవాళ ఎయిరో ఇండియా అంటే ఇండియా బలం, ఇది కేవలం ఒక షో ఎంతమాత్రం కాదు." అని ప్రధానమంత్రి అన్నారు. ఇది రక్షణ రంగ అవకాశాలను ప్రదర్శించేదే కాకుండా, దేశ ఆత్మ విశ్వాసాన్ని తెలియజేస్తుందని ప్రధానమంత్రి చెప్పారు.

ఇండియా విజయాలు, దాని సామర్థ్యాలకు నిదర్శనమని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. తేజస్, ఐఎన్‌ఎస్ విక్రాంత్,ఐఎన్‌ఎస్ విక్రాంత్, సూరత్, తుముకూరు లోని అధునాతన తయారీ సదుపాయాలు, ఆత్మనిర్భర్ భారత్ సామర్థ్యాలకు నిదర్శనమని ఆయన అన్నారు. వీటితో ప్రపంచ నూతన ప్రత్యామ్నాయాలు, అవకాశాలను అనుసంధానించడం జరిగిందన్నారు.

" 21 వ శతాబ్దపు నవభారతదేశం, ఏ అవకాశాన్నీ జార విడుచుకోదని, లేదా కృషిచేయకుండా ఉండదని" అన్నారు.ప్రతి రంగంలోనూ సంస్కరణల సాయంతో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్టు చెప్పారు.దేశం ఇప్పుడు ప్రపంచంలోని 75 దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తున్నదని అన్నారు. గడచిన 8 '9 సంవత్సరాలలో రక్షణరంగంలో వచ్చిన పరివర్తన గురించి ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి, రక్షణరంగ ఎగుమతులను 2024'25 నాటికి 1.5 బిలియన్‌ల నుంచి 5 బిలియన్లకు తీసుకుపోవాలన్నది తమ లక్ష్యమన్నారు. " ఇక్కడి నుంచి ఇండియా అద్భుతంగా ముందుకు వెళుతున్నదని, ప్రపంచంలోని పెద్ద రక్షణ తయారీదారుల సరసన చేరుతున్నదని, మన ప్రైవేటు రంగం, ఇన్వెస్టర్లు ఇందులో కీలక పాత్ర పోషించనున్నారని " అన్నారు. రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టవలసిందిగా ప్రధానమంత్రి ప్రైవేటు రంగానికి పిలుపునిచ్చారు.ఇది వారికి ఇండియాలో ఇతర దేశాలలో మంచి అవకాశాలను తెచ్చిపెడుతుందన్నారు.

" ప్రస్తుత భారతదేశం వేగంగా ఆలోచిస్తుందని, దూరదృష్టితో ఆలోచిస్తుందని, సత్వర నిర్ణయాలు తీసుకుంటుందని" ప్రధానమంత్రి అన్నారు. అమృత్ కాల్ లో భారతదేశాన్ని ఫైటర్ జెట్ పైలట్‌తో ప్రధానమంత్రి పోల్చారు. ఇండియా దేనికీ భయపడదు. ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఉత్సాహంతో పైపైకి వెళుతుంది అని ప్రధానమంత్రి అన్నారు. అలాగే ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలు బలంగా ఉండే లక్షణం ఇండియా సొంతమని ప్రధానమంత్రి చెప్పారు.ఎయిరో ఇండియా గర్జన, ఇండియా సందేశమైన రిఫార్మ్, పెర్ఫార్మ్ , ట్రాన్స్‌ఫార్మ్‌ను ప్రతిధ్వనింప చేస్తున్నదని ప్రధానమంత్రి అన్నారు. ఇండియాలో సులభతర వ్యాపారానికి సంబంధించి చేపట్టిన సంస్కరణలను ప్రపంచం మొత్తం గమనిస్తున్నదని ప్రధానమంత్రి చెప్పారు. ఇది అంతర్జాతీయ పెట్టుబడులకు సానుకూల వాతావరణాన్ని ఏర్పరచిందని, భారతీయ ఆవిష్కరణలకు దోహదపడిరదని అన్నారు. రక్షణ, ఇతర రంగాలలో విదేశీ సంస్థాగత పెట్టుబడుల విషయంలో తీసుకువచ్చిన సంస్కరణలను ప్రధానమంత్రి ప్రస్తావించారు. పరిశ్రమలకు లైసెన్సులు మంజూరు చేసే ప్రక్రియలను సులభతరం చేయడం, వాటి వాలిడిటీపెంపు వంటి వాటి గురించి ప్రధానమంత్రి తెలిపారు. ఈ సంవత్సరం బడ్జెట్ లో తయారీ యూనిట్లకు పన్ను రాయితీలు పెంచినట్టు చెప్పారు. నైపుణ్యాలు, అనుభవం వంటివి డిమాండ్‌ఉన్న చోట పరిశ్రమ ప్రగతికి దోహదపడడం సహజమేనని ప్రధానమంత్రి అన్నారు. ఈ రంగాన్ని మరింత బలోపేతంచేయడానికి చర్యలను మరింత ముందుకు తీసుకువెళ్ళడం జరుగుతుందని ప్రధానమంత్రి అన్నారు.

## ప్రపంచ వ్యాప్తంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు : మహేశ్ బిగాల

హైదరాబాద్, ఫిబ్రవరి 14:తెలంగాణ రాష్ట్ర సాధన రథసారధి, ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఎన్ఆర్ఐలు ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల పిలుపునిచ్చారు.ఈనెల 17న కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కొన్ని దేశాల్లో రక్తదాన శిబిరాలు, గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటాలని కోరారు.

అనాధలకు సహాయం చేయడం లాంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని బీఆర్ఎస్ ప్రతినిధులను కోరారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా మారాయని అన్నారు. ప్రధానంగా వ్యవసాయం, పారిశ్రామిక, ఐటీ, విద్యుత్ రంగాల్లో సాధించిన ప్రగతి అభినందనీయమని అన్నారు. పేద, బడుగు,బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు విజయవంతంగా అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## ఎయరో ఇండియా 2023 యొక్క దృశ్యాలను శేర్ చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:ఎయరో ఇండియా 2023 కు సంబంధించిన కొన్ని దృశ్యాల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శేర్ చేశారు.

"రక్షణ రంగం లో మరియు ఎయరో స్పేస్ రంగం లో భారతదేశం వేస్తున్నటువంటి ముందంజల ను ఎయరో ఇండియా 2023 కళ్ళ కు కట్టింది. ఇది నూతన ఆవిష్కరణల ను ప్రదర్శిస్తున్నటువంటి వివిధ దేశాల కు చెందిన వ్యక్తుల ను ఒక చోటు కు తీసుకొని వచ్చింది.""ఎయరో ఇండయా 2023 లో భాగం గా ఏర్పాటైన మార్గదర్శక ప్రాయం అయినటువంటి కర్నాటక పెవిలియన్ ను సందర్శించాను. ఎయరో స్పేస్ పరిశ్రమ కు కర్నాటక అందిస్తున్నటువంటి ఘనమైన తోడ్పాటు ను చూసుకొని యావత్తు దేశ ప్రజలు గర్వపడుతున్నారు." అని పేర్కొన్నారు.

## జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ, సర్వే పనులను వేగవంతం చేయండి

మెదక్, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ, సర్వే పనులను వేగవంతం చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా నీటి పారుదల, రెవిన్యూ శాఖాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల పురోగతి, భూ సేకరణ, 13, 18వ ప్యాకేజి పనులు,రామయంపేట్, శంకరంపేట్ కాలువల నిర్మాణం పనులపై నీటిపారుదల, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఏజెన్సీ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సాగునీటి కాలువల నిర్మాణ ప్రాధాన్యతను గుర్తించిత్వరితగతిన బడ్జెట్ అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సమర్పించవలసినదిగా అధికారులకు సూచించారు. ప్రధానంగా రామాయంపేట కాలువకు సంబంధించి భూ సేకరణ పనులు, చిన్న శంకరంపేట్ కు సంబంధించి డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి పెగ్ మార్కింగ్ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. భూ సేకరణ కు సంబంధించి అవార్డు పాసైన వాటికి నిధులు మంజూరు చేయాలని సూచించారు. కాలువల నిర్మాణానికి వీలైనంత త్వరగా భూసేకరణ చేసి సర్వే పనులను సైతం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల యెస్ ఈ యేసయ్య, ఆర్.డి.ఓ. సాయి రామ్,శ్యామ్ ప్రకాష్, నీటిపారుదల ఇంజనీరింగ్ అధికారులు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, సూపరింటెండెంట్ బలరాం, ఏజెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## ఆత్మనిర్భరతకు ప్రాధాన్యాన్ని ఇస్తున్న తన ప్రయాసలలో సహకారం మరియు భాగస్వామ్యం ఆహ్వానించిన భారతీయ వాయు సేన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:భారతీయ వాయు సేన ఆత్మనిర్భరత కు పెద్ద పీట ను వేస్తున్నటువంటి తన ప్రయాసల లో సహకారాన్ని అందించాలని మరియు భాగస్వామ్యాన్ని నెలకొల్పుకోవాలంటూ దేశం లోని విద్య రంగ ప్రముఖుల కు, వైజ్ఞానిక సముదాయాని కి మరియు పరిశ్రమ జగతి కి చెందిన వారికి ఆహ్వానం పలికింది. ఎయరో ఇండియా 2023 కు ముందు రోజు న ఆసక్తి అభివ్యక్తీకరణ (ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్) కై 31 ఆహ్వానాల ను ఇవ్వడమైంది.

ఇది ఆత్మనిర్భరత దిశ లో సాగుతున్నటువంటి ఒక సాహస యాత్ర లో కీలక భాగస్వాములు గా మారేందుకు భారతదేశం లోని కుశాగ్ర బుద్ధుల కు మరియు చైతన్యశీలురైనటువంటి నవ పారిశ్రామికవేత్తల కు ఒక గొప్ప అవకాశం అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారతీయ వాయు సేన యొక్క ఒక ట్వీట్ కు ప్రధాన మంత్రి సమాధానాన్ని ఇస్తూ, అందులో –

"మన దేశ ప్రజలు సదా గర్వించేటటువంటి రక్షణ రంగం లో స్వయం సమృద్ధి సాధన కై చేపట్టిన ఒక మిశన్ లో మహత్వపూర్ణ భాగస్వామ్యాన్ని నెలకొల్పేందుకు భారతదేశం లోని అమిత ప్రతిభావంతుల కు మరియు చైతన్యశీలురు అయినటువంటి నవ పారిశ్రామికవేత్తల కు ఇది ఒక గొప్ప అవకాశం." అని పేర్కొన్నారు.







# బహుముఖ ప్రజ్ఞాశాలి సరోజినీ నాయుడు

## (13 ఫిబ్రవరి సరోజినీ నాయుడు జయంతిని 'జాతీయ మహిళా దినం" పాటిస్తున్న సందర్భంగా)

13 ఫిబ్రవరి 1879న హైదరాబాద్‌లోని బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో డా: అఘోరనాథ్ చటోపాధ్యాయ (నిజామ్ కాలేజ్ ప్రిన్సిపల్), బరదా సుందరీ దేవి పుణ్య దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించిన సరోజినీ నాయుడు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, ఆంగ్ల రచయిత్రి, కవయిత్రి, నాయకురాలు, పౌరహక్కుల పరిరక్షకురాలు, మహిళాభ్యుదయ నేత, మేధావి, వక్త, సుస్వర గాయని, బాల మేధావి, పరిపాలనాదక్షురాలు, భారత జాతీయ కాంగ్రెస్ ముఖ్య నాయకురాలుగా మనందరికీ చిరపరిచితురాలే. తన గాత్రానికి ముగ్దుడైన మహాత్మాగాంధీ సరోజినీ నాయుడిని 'భారత కోకిల (నైటింగేల్ ఆఫ్ ఇండియా)' అని నామకరణం చేశారు. మెట్రిక్యులేషన్‌ను యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, కింగ్స్ కాలేజ్ లండన్, గిర్టన్ కాలేజ్ కేంబ్రిడ్జిల్లో నిజామ్ స్కాలర్‌షిప్‌తో ఉన్నత విద్యను అభ్యసించింది మన సరోజినీ నాయుడు.

### స్వాతంత్ర్యోద్యమ బాటలో?:

1905లో వలసపాలనకు వ్యతిరేకంగా గళమెత్తి, 'స్వరాజ్య' పిలుపుకు ఆకర్షితురాలై గాంధీ అనుచరురాలిగా భారత జాతీయ కాంగ్రెస్ ఉద్యమంలో పాల్గొన్నారు. 1925లో భారత జాతీయ కాంగ్రెస్ ప్రథమ మహిళా అధ్యక్షురాలిగా, 1947లో యునైటెడ్ ప్రొవిన్స్ (ప్రస్తుత యూపీ) గవర్నర్‌గా సేవలు అందించారు. బాలలు, దేశభక్తి, ప్రేమరసం, విషాద గీతాల రచయితగా కీర్తిని గడించిన "నైటింగేల్ ఆఫ్ ఇండియా" వైద్యులు డా: పైడిపాటి గోవిందరాజులు నాయుడిని కందుకూరి వీరేశలింగం పంతులు సమక్షంలో 19వ ఏట కులాంతర, ప్రాంతాంతర వివాహమాడి ఆదర్శంగా నిలిచారు. 1915 – 1918 మధ్య మాతృ దేశాన్ని పర్యటించి జాతీయతాభావం, మహిళా వికాసం, సామాజిక అభ్యున్నతి అంశాలలో ప్రసంగించి ప్రజలను చైతన్య పరిచారు. నెహ్రూ, మదన్ మోహన్ మాలవీయ, గోపాలకృష్ణ గోకలే, రబింద్రనాథ్ టాగూర్, అన్నీ బిసెంట్ లాంటి ప్రముఖుల మార్గదర్శకత్వంలో పని చేశారు. 'ఉప్పు సత్యాగ్రహం', 'సహాయ నిరాకరణ', 'క్విట్ ఇండియా' లాంటి ఉద్యమాల్లో ముందు నడిచి 21 నెలలు జైలు పాలైనారు.

### బహుముఖ ప్రజ్ఞాశాలి:

సరోజినీ నాయుడు తన 12వ ఏటనే రచనలు ప్రారంభించి మెహర్ మున్నీర్, ది గోల్డన్ త్రిషోల్డ్, ఇన్ ది బజార్స్ ఆఫ్ హైదరాబాద్, ది ఫాదర్ ఆఫ్ ది డాన్, ది బర్డ్ ఆఫ్ టైమ్, ది బ్రోకెన్ వింగ్స్, ది ఫెదర్ ఆఫ్ ది డాన్, దిస్ప్రెటెడ్ ఫ్లూట్ లాంటి పలు కవితా సంకలనాలు రచించి, చక్కటి స్వరంతో గానం చేశారు. పిల్లల అనాథశ్రమాలు, బాలికల విద్యకు పరితపించి, మహిళోద్ధరణకు కంకనబద్దులై 1917లో భారత మహిళా సంఘం ఏర్పాటు చేశారు. యునివర్సిటీ ఆఫ్ లండన్ రూపొందించిన 150 మంది ప్రపంచ ధీరవనితల జాబితాలో చోటు దక్కించుకున్నారు. కైసర్–ఇ–హింద్ బంగారు పతకం, గూగుల్ డూగుల్, భారత కోకిల లాంటి పురస్కారాలను పొందిన సరోజినీ నాయుడు పేరును 5647 ఉల్క లేదా నక్షత్ర శకలానికి పెట్టడం జరిగింది. ఉర్దూ, తెలుగు, ఆంగ్లం, బెంగాలీ, పార్సీ భాషలు మాట్లాడే సరోజినీ నాయుడు ఆధునిక భారత రూపకర్తల్లో ఒకరుగా సుస్థిర స్థానం దక్కించుకున్నారు. ఐదుగురు పిల్లలకు తల్లి అయిన సరోజినీ నాయుడును మహాత్మా గాంధీ 'చాకోలేట్ వర్ణపు మిక్కీ మౌస్', 'డియర్ బుల్‌బుల్' అనే ముద్దు పేర్లతో పిలిచే వారు. తన 70వ ఏట అనారోగ్యంతో లక్నోలో 02 మార్చి 1949న తుది శ్వాస విడిచారు.

### జాతీయ మహిళా దినోత్సవం:

13 ఫిబ్రవరి సరోజినీనాయుడు జన్మదినం సందర్భంగా భారత ప్రభుత్వం 'జాతీయ మహిళా దినం'గా పాటిస్తున్నది. సృష్టిలో సగభాగమైన మహిళా సమాజం పట్ల చిన్న చూపు, లింగ అసమానతల అగాధాలు, మహిళా హక్కుల హననాలు, భ్రూణహత్యలు, గృహ హింసలు, బాల్యవివాహాలు, బాల కార్మికులు, లైంగిక వేధింపులు, మహిళా స్వేచ్ఛ, ఆసిడ్ దాడులు, వరకట్న వేధింపులు, బాలిక అక్రమ రవాణ, మహిళల అవిద్య, అత్యాచార హత్యలు, ఆర్థిక స్వావలంభన లేకపోవడం లాంటి పలు గంభీర సమస్యల పట్ల సంపూర్ణ అవగాహన కలిగించడానికి 13 ఫిబ్రవరి వేదికలను వినియోగిస్తారు. ప్రపంచంలోని 160 దేశాల లింగ అసమానతల సూచికలో భారత్ స్థానం 127 ఉండడం భారతీయ మహిళల దుస్థితికి అద్దం పడుతున్నది. దేశంలో సెకండరీ విద్య పూర్తి చేసిన పురుషులు 63.5 శాతం ఉండగా, మహిళల్లో 39 శాతం మాత్రమే ఉన్నారు. శ్రామిక లోకంలో పురుషులు 78.8 శాతం ఉండగా, మహిళల్లో 27.2 శాతం కనిపిస్తున్నది. నాగరిక సమాజంలో పిల్లల పెంపకంలో బాలికల పట్ల వివక్ష అధికంగా ఉండడం విచారకరం. పార్లమెంట్‌లో మహిళా ప్రాధాన్యత 14.5 శాతం మాత్రమే ఉండడం గమనార్హం.

ఆధునిక యుగంలో మహిళలు పురుషులతో సమానంగా అంతరిక్షంలో విహరించడం, యుద్ధక్షేత్రాల్లో ధీరవనితలుగా రుజువు చేసుకోవడం, హెలికాప్టర్/విమాన పైలెట్లు లాంటి అన్ని వర్గాల్లో ముందుండి తమ ప్రతిభను ప్రదర్శించడం హర్షదాయకం. నేటి యువతకు, ముఖ్యంగా మహిళలకు ప్రేరణగా నిలుస్తున్న ధీర వనిత సరోజినీ నాయుడు జీవితం మన మహిళామణులకు ప్రేరణ కావాలని, సన్మార్గాన్ని చూపాలని కోరుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ప్రపంచం భారత దేశాన్ని గౌరవంగా, భరోసాగా చూస్తోంది: కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలో ఇది దేశం నిరాశావాదం నుండి ఆశావాదం వైపు ప్రయాణం సాగిస్తోందని కేంద్ర సైన్స్ ఉ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) ; భూగోళ శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత); ప్రధాన మంత్రి కార్యాలయ శాఖ సహాయ మంత్రి, పీఎంవో, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి మరియు అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. 2014కి ముందు విదేశాల్లో పర్యటించే భారతీయుల సంఖ్య తగ్గుముఖం పట్టిందని వివరించారు. 2014 కి ముందు విదేశాలలో పర్యటించిన భారతీయులు తమ ఆత్మగౌరవం తగ్గినట్టుగా భావించేవారని ఆయన వివరించారు. అయితే నేడు ప్రపంచం మొత్తం భారతదేశాన్ని ఎంతో గౌరవంగా, ఉన్నతంగా, భరోసాగా చూస్తుండడం నూతన ఒరవడిగా కనిపిస్తోందని అన్నారు. ఇది గతానికి భిన్నంగా ఉందని తెలిపారు.

కొత్త సంస్కరణలతో సరికొత్త మేలు..

ఆదివారం ఢిల్లీలోని హోటల్ లీలాలో రోటరీ ఇంటర్నేషనల్ వార్షిక సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, భారతదేశ వెలుగులోకి రాని సామర్థ్యాలను గ్రహించడంలో ప్రధాన మంత్రి మోడీ దార్శినికత చర్యలు సహాయపడ్డాయని ఆయన తెలిపారు. ప్రధాని అనేక కొత్త సంస్కరణలను తీసుకురావడం, వాడుకలో లేని నిబంధనలను తొలగించడం వంటి అనేక మార్గాలను తీసుకురావడం ద్వారా భారతదేశం యొక్క సామర్థ్యాలను గరిష్టంగా వినియోగించుకునేలా చేశారన్నారు. 2014కి ముందు దేశ పౌరుడు అనేకమంది అగ్రమంత్రులు ప్రమేయం ఉన్న స్కామ్‌లు మరియు అవినీతి కుంభకోణాల పరంపరతో నిరాశకు గురయ్యారని అన్నారు. అయితే 9 ఏళ్ల మోడీ సర్కారులో ఒక్క మంత్రి కూడా అలాంటి ఆరోపణలకు గురికాలేదని వివరించారు. మోదీ సృష్టించి అందించిన ఈ విశ్వాసం సగటు భారతీయుడి సంకల్ప బలం పెంచిందని.. ఆయా రంగాలలో ముందుకు వెళ్లడానికి మరియు మిగిలిన ప్రపంచానికి నాయకత్వం వహించాలనే సంకల్పాన్ని అందించిం దని అన్నారు.

మహమ్మారి సమయంలో ప్రపంచం భారతదేశం వైపు చూస్తోంది..

గత తొమ్మిదేళ్ల మోదీ పాలనలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా మాంద్యం పోకడల ఎదురైనప్పటికీ భారతదేశాన్ని ఐఎంఎఫ్ మరియు ప్రపంచ బ్యాంకు "వేగు చుక్కగా"గా అభివర్ణించాయని మంత్రి అన్నారు. 2021 డిసెంబర్ వరకు 94 దేశాలకు 750 లక్షల డోసుల కోవిడ్–19 వ్యాక్సిన్‌ను భారతదేశం సరఫరా చేసిందని వివరించారు, కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రపంచం భారతదేశం వైపు చూస్తోందని మంత్రి వివరించారు.

భారత్ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన వృద్ధిని చూడబోతోంది..

మరో ఉదాహరణను ఉటంకిస్తూ గతంలోని సంకెళ్లు మరియు నిషేధాల నుండి మోడీ అంతరిక్ష శాఖకు విముక్తి కలిగించారని, భారతదేశం కంటే ముందు తమ అంతరిక్ష యాత్రను ప్రారంభించిన యుఎస్ఏ, రష్యా వంటి దేశాలను నేడు మార్చ్ ఎంచుకున్నారని మంత్రి అన్నారు. 2014కి ముందు ప్రభుత్వం మరియు పాలక వ్యవస్థలలో విధాన ప్రణాళికలు రూపొందించేవారు. యథాతథ స్థితి నుండి బయటపడేందుకు సిద్ధంగా లేరని మరియు భారతదేశం యొక్క విస్తారమైన పూర్తి స్థాయికి స్వేచ్ఛగా మరియు పూర్తిగా ఆడటానికి అనుమతించడానికి సిద్ధంగా లేరని ఇది నిరూపించింది. 2014కి ముందు ప్రభుత్వం మరియు పాలక వ్యవస్థలలో విధాన ప్రణాళికలు రూపొందించేవారు, ఇవి ప్రగతి చోదకంగా లేక.. యథాతథ స్థితి నుండి బయటపడేందుకు సిద్ధంగా లేదనే భావన కల్పించేంది. భారతదేశం విస్తారమైన పూర్తిస్థాయికి స్వేచ్ఛగా, మానవ వనరుల పూర్తిస్థాయి వినియోగానికి తగినట్టుగా అనుమతించడానికి సిద్ధంగా లేవు అన్నట్టుగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితిలో మార్పు వచ్చిందని వివరించారు. రాబోయే సంవత్సరాల్లో భారతదేశ వృద్ధికి విస్తారమైన సముద్ర వనరులు, సుదీర్ఘమైన హిమాలయ వనరులు వంటి అన్వేషించబడని అనేక ప్రాంతాలు అనుబంధంగా ఉంటాయని విశ్వాసం వ్యక్తం చేశారు. 70 సంవత్సరాలుగా ఇవి భారతదేశానికి ఒక ప్రత్యేకమైన ప్రయోజనాలని గుర్తించబడలేదని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. డీప్ సీ మిషన్ మరియు అరోమా మిషన్ వంటి కార్యక్రమాలపై ప్రధాన మంత్రి పునరుద్ఘాటించిన దృష్టితో భారతదేశం తన ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన వృద్ధిని చూడబోతోందని అన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్కు రోటరీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రాబర్ట్ హాల్ మరియు అతని భార్య చార్లీన్ స్వాగతించి అభినందించారు.

శక్తివంతమైన సంస్థ రోటరీ..

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, రోటరీ 200 దేశాలలో 1.4 మిలియన్లకు పైగా సభ్యులను కలిగి ఉందని, ఇది ప్రపంచంలోని అతిపెద్ద సేవా సంస్థలలో ఒకటిగా మారిందని అన్నారు. 1920లో కేవలం ఒక క్లబ్‌తో ప్రారంభమైన రోటరీ ఇండియా భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో 4500 క్లబ్‌ల నుండి 2 లక్షల మంది సభ్యులతో కూడిన శక్తివంతమైన సంఘంగా మారిందని అని మంత్రి తెలిపారు.

# 'ఏక్ భారత్- శ్రేష్ఠ భారత్' నినాదాన్ని ప్రతిబింబించేలా ముంబైలో రాష్ట్రీయ సంస్కృతీ మహోత్సవ్ - 2023 ప్రారంభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:రాష్ట్రీయ సంస్కృతీ మహోత్సవ్ తిరిగి వచ్చింది, ఈ సారి ముంబైలో . ఇది ప్రతి ఒక్కరికీ దృశ్య , సంగీత విందుగా ఉంటుందని హామీ ఇస్తుంది. రాష్ట్రీయ సంస్కృతీ మహోత్సవ్ 2023ను మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి ముంబై చర్చిగేట్ లోని ఆజాద్ మైదానంలో శనివారం సాయంత్రం ప్రారంభించారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 11 నుండి 19 వరకు సాంస్కృతిక మార్పిడి ద్వారా జాతీయ ఐక్యత , సమగ్రతను పెంపొందించడానికి ఈ మహోత్సవ్ ను నిర్వహిస్తోంది.

మహారాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాలు, అటవీ, మత్స్య శాఖ మంత్రి సుధీర్ ముంగంటివార్, పర్యాటక, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, ఎంటర్ ప్రెన్యూర్ షిప్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారి ప్రసంగిస్తూ, రాష్ట్రీయ సంస్కృతి మహోత్సవ్ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ శాశ్వత సందేశాన్ని తెలియజేస్తుందని, ఇది భాష ,సాంస్కృతిక వ్యక్తీకరణలలో అనేక వైవిధ్యాలు ఉన్నప్పటికీ, భారతదేశం ఐక్యంగా ,ఒకటిగా ఉందని సూచిస్తుందని అన్నారు. కుంభమేళా తరహాలో ఈ మహోత్సవం ప్రపంచ ప్రసిద్ధి చెందాలని గవర్నర్ ఆకాంక్షించారు.

భారత ప్రభుత్వం భారతీయ సంస్కృతి పునరుజ్జీవనానికి నాంది పలుకుతోందని గవర్నర్ అన్నారు. మన గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచం గమనించడానికి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఒక ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక, కాలాతీత సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ సజీవంగా ఉంచుకోవాలని గవర్నర్ విజ్ఞప్తి చేశారు. ముంబైవాసులందరితో పాటు రాష్ట్రం, దేశంలోని ఇతర ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ మహోత్సవ్ ను సందర్శించాలని,మన సంస్కృతి, కళలు, వంటకాలు , ఇతర ప్రత్యేకతలను అనుభూతి చెందాలని ఆయన కోరారు.

కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14 నుంచి బాబాసాహెబ్ అంబేద్కర్ సర్క్యూట్ రైలును ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

ముంబై ప్రజల కోసం మహోత్సవ్ సందర్భంగా సుమారు 1000 మంది కళాకారులు ప్రదర్శనలు ఇస్తారని కేంద్ర మంత్రి చెప్పారు. ముంబై నగరం సాంస్కృతికంగా సుసంపన్నమైన పర్యాటక ప్రదేశాలు, సంస్థలు, పండుగలు, నృత్యం మరియు సినిమా వంటి కళా రూపాలతో పురాతన సాంప్రదాయం –ఆధునికతల సంగమంగా ప్రత్యేకత కలిగి ఉందని శ్రీ కిషన్ రెడ్డి అన్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తితో కళలు, సంస్కృతి ద్వారా భారతదేశ వైవిధ్యాన్ని చాటిచెప్పడం ద్వారా జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు ఈ మహోత్సవ్ ను నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ మహోత్సవ్ మన గొప్ప సంస్కృతిని ఒక తరం నుండి మరొక తరానికి ప్రసారం చేస్తుందని, మన దేశీయ సంస్కృతి,కళల పట్ల మన ప్రజలలో అభిమానాన్ని ప్రేమను పునరుజ్జీవింపజేస్తుందని మంత్రి అన్నారు. "వోకల్ ఫర్ లోకల్"ను కూడా ప్రోత్సహిస్తున్నామని, మన పుణ్యక్షేత్రాల అభివృద్ధిని ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిందని అన్నారు.

ముంబైవాసులందరూ ఈ ఫెస్టివల్ ను సందర్శించి, భారతీయ సంస్కృతి లోని వివిధ రూపాలను ఆస్వాదించడం ద్వారా ప్రేరణ, విజ్ఞానం వవినోదాన్ని పొందాలని కేంద్ర మంత్రి విజ్ఞప్తి చేశారు.

మహారాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాలు, అటవీ, మత్స్య శాఖ మంత్రి సుధీర్ ముంగంటివార్ మాట్లాడుతూ, ప్రపంచ దేశాలలో భారతదేశం అత్యంత వైవిధ్యమైన, సాంస్కృతికంగా సంపన్నమైన దేశమని అన్నారు. దేశంలో, మహారాష్ట్ర రాష్ట్రంలోని అనేక జానపద కళలను గుర్తు చేసిన మంత్రి, కేవలం సంపదతో సాధించలేని మనశ్శాంతికి సంస్కృతి దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏక్ భారత్– శ్రేష్ఠ భారత్ కార్యక్రమానికి మహారాష్ట్ర క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని చెప్పారు.

భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి అమితా సారాభాయ్ మాట్లాడుతూ, హస్తకళ, సంస్కృతి వంటకాల " (3 సిల) ద్వారా వివిధ రాష్ట్రాల సంస్కృతులను ఒకదానితో మరొక దానిని సామాన్య పౌరులతో అనుసంధానించడమే మహోత్సవ్ లక్ష్యమని అన్నారు.

ప్రారంభోత్సవంలో తేజస్విని సాథే, ఆమె బృందం శాస్త్రీయ కథక్ నృత్య ప్రదర్శనలకు ప్రేక్షకులు ముగ్ధులయ్యారు.

ప్రతిభావంతులైన నృత్యకారుల బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం శక్తివంతమైన, లయబద్ధమైన , వ్యక్తీకరణ రూపం ద్వారా ప్రేక్షకులను కొత్త లోకాలకు తీసుకువెళ్ళింది. ప్రముఖ గాయకుడు మోహిత్ చౌహాన్ 'తుమ్సే హి, 25 సాల్ కా సురీలా సఫర్' (25 ఏళ్ల సంగీత ప్రయాణం) పేరుతో తన ప్రదర్శనలో పలు పాటలను శ్రావ్యంగా ఆలపించారు.

స్వాతంత్ర్య పోరాటంలో మరచిపోయిన, అంతగా ప్రసిద్ధి చెందని వీరుల ఇతివృత్తంపై ఆర్ ఎస్ ఎం వేదికపై సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లను మంత్రి సందర్శించారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు మోహిత్ చౌహాన్ సంగీత కచేరీలో పాల్గొన్నారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు మోహిత్ చౌహాన్ సంగీత కచేరీలో కూడా పాల్గొన్నారు.

భారతదేశం నలుమూలల నుండి సుమారు 350 మంది జానపద , గిరిజన కళాకారులతో పాటు సుమారు 300 మంది స్థానిక జానపద కళాకారులు, కొంతమంది ట్రాన్స్జెండర్ ,వికలాంగ కళాకారులు, ప్రసిద్ధ శాస్త్రీయ కళాకారులు అలాగే ప్రసిద్ధ స్టార్ కళాకారులు తమ మనోహరమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు.

కళాకారులతో పాటు, దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు చెందిన ఏడు జోనల్ సాంస్కృతిక కేంద్రాల నుండి సుమారు 150 మంది హస్తకళాకారులను అంగన్ ఆధ్వర్యంలో వారి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ సేల్ కమ్–ఎగ్జిబిషన్ కోసం ఆహ్వానించారు, దీని కోసం సుమారు 70 స్టాల్స్ అందుబాటులో ఉన్నాయి. అలాగే మహారాష్ట్ర రాష్ట్ర చేనేత శాఖ, స్టార్టప్ ల కోసం 25 స్టాల్స్ ను ఏర్పాటు చేశారు.

భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం ఈ మహోత్సవ్ ను నిర్వహిస్తుంది.

# భారతదేశం జి20 అధ్యక్షత కింద వ్యవసాయ వర్కింగ్ గ్రూప్ (ఎడబ్ల్యుజి) 1వ అగ్రికల్చర్ డిప్యూటీస్ మీటింగ్ సిద్ధంగా ఉన్న ఇండోర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:మూడు రోజుల కార్యక్రమమైన 1వ ఎడిఎం 13–15 ఫిబ్రవరి 2023వరకు ఇండోర్‌లో జరుగుతోంది. జి20 దేశాలు, అతిథి దేశాలు, అంతర్జాతీయ సంస్థలకు చెందిన వందమంది ఈ సమావేశంలో పాల్గొంటారని భావిస్తున్నారు.

మూడురోజుల సమావేశంలో తొలిరోజు ప్రదర్శనను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ శిరాజ్‌సింగ్ చౌహాన్ ప్రారంభించనున్నారు. చిరుధాన్యాలు, విలువ జోడించిన ఆహార పదార్థాలతో పాటుగా పశుసంవర్ధక, మత్స్య శాఖలకు చెందిన స్టాళ్ళు ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా ఉండనున్నాయి.

వ్యవసాయ వర్కింగ్ గ్రూప్ తొలి ఎడిఎంలో మొదటి రోజు వ్యవసాయ సంబంధిత విషయాలను అంశాలను చర్చించాలని నిర్ణయించారు. రెండవ రోజు కేంద్ర పౌరవిమానయాన మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా సమావేశానికి హాజరు కానున్నారు. ఆ రోజు పాల్గొంటున్న సభ్యులు, అంతర్జాతీయ సంస్థల మధ్య సాధారణ చర్చలు జరుగనున్నాయి.

మూడవ రోజు ఎడబ్ల్యుజి కీలక బట్వాడాలపై చర్చలకు కేటాయించారు. ఇందులో పాలుపంచుకుంటున్న సంబంధిత సభ్యులు, అంతర్జాతీయ సంస్థలతో రోజంతా చర్చలు జరిగే సాంకేతిక సెషన్‌గా ఇది ఉండనుంది.

ఈ కార్యక్రమం సందర్భంగా, ప్రతినిధులు రాజ్వాడా ప్యాలెస్, మాండు కోట వంటి వారసత్వ సంపదలను సందర్శించడం ద్వారా సుసంపన్నమైన భారతీయ చరిత్రను తెలుసుకుంటారు. భారీ విందులు, సాంస్కృతిక ప్రదర్శనలు మన భారతీయ వంటకాల, సంస్కృతి రుచిని అతిథులకు అందిస్తాయి.

# రాష్ట్రంలో ఉన్న నిజాయితీగల ప్రభుత్వం మరియు సురక్షితమైన వాతావరణం గ్లోబల్ ఇన్వెస్టర్లు యూపిలో పెట్టుబడులు పెట్టడానికి కారణంగా ఉన్నాయి

## – కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:ప్రపంచ పారిశ్రామికవేత్తలు ఉత్తరప్రదేశ్‌లో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలోని నిజాయితీ కలిగిన ప్రభుత్వం మరియు సురక్షితమైన వాతావరణం కారణంగా ఉందని కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజాపంపిణీ మరియు జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈరోజు లక్నోలో జరిగిన యుపి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ అన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో మనం చూడగలిగే మరియు అనుభూతి చెందుతున్న వేగవంతమైన పురోగతి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ యొక్క సమర్థ నాయకత్వానికి కారణమని ఉత్తరప్రదేశ్ పురోగతి అతి వేగంగా ఉందని ఇప్పుడు దానిని ఎవరూ ఆపలేరని ఆయన అన్నారు.

2017లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నప్పుడు ప్రారంభమైన కథను శ్రీ గోయల్ వివరించారు. 'అప్పట్లో పార్టీ కోసం మేనిఫెస్టో రూపొందించే పని మాకు అప్పగించారు. మేము రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలిశాము. అన్ని వర్గాల ప్రజలు మార్పు మరియు సమర్థవంతమైన పరిపాలనను కోరుకున్నారు. అయితే చేయాల్సిన పనులకు కావాల్సిన నిధులు ఎక్కడి నుంచి వస్తాయని ఆలోచించాం. అయితే వేం మేనిఫెస్టోలో ఏది హామీ ఇచ్చామో వాటిని అమలు చేయాల్సిందేనని ప్రధాని స్పష్టం చేశారు.

భూమాఫియా, ఇసుక మాఫియా, మద్యం మాఫియాలను అంతమొందించేందుకు మనం మూడు పనులు చేయాల్సి ఉంటుందని ఆ సమయంలో హోంమంత్రి శ్రీ అమిత్ షా చెప్పారని మంత్రి చెప్పారు. మనం దీన్ని చేయగలిగితే రాష్ట్రంలో వనరుల కొరత ఎప్పటికీ ఉండదని శ్రీ షా అన్నారని శ్రీ గోయల్ తెలిపారు. నిజాయితీ గల ప్రభుత్వం, ప్రజల సంక్షేమం కోసం పని చేసే ప్రభుత్వం, ఎలాంటి తప్పులను సహించని ప్రభుత్వం అవసరమైన ఆదాయాన్ని నిర్ధారించి, రాష్ట్రాన్ని కొత్త స్థాయికి తీసుకువెళ్లగలదని ఇటీవలి సంవత్సరాలలో యుపి పురోగతి సాధించిన తీరు తెలియజేస్తుందని శ్రీ గోయల్ అన్నారు. .

ఈ సమ్మిట్‌లో పెట్టుబడిదారులు అనేక లక్షల కోట్ల రూపాయల ఒప్పందాలు చేసుకున్నారని కేంద్ర వాణిజ్య మంత్రి దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ఇప్పుడు సులభమని, రాష్ట్రంలో నిజాయితీ వ్యవస్థ ఉందని, శాంతిభద్రతలు నెలకొంటాయని, పెట్టుబడిదారులు రాష్ట్ర ప్రజలపై విశ్వాసం ఉంచారని ఇప్పుడు ప్రజలు నమ్ముతున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి నిజాయితీ గల ప్రభుత్వానికి యూపీ ప్రజలు ఓట్లు వేస్తారని తాము నమ్ముతున్నామని ఆయన అన్నారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్ గురించి శ్రీ గోయల్ మాట్లాడుతూ వ్యాపారం చేయడం ఎక్కడ సులభమో అంచనా వేయడానికి దేశవ్యాప్తంగా ఇది జరుగుతుందని, ఇటీవలి సంవత్సరాలలో భారతదేశం గ్లోబల్ ర్యాంకింగ్‌లో దూసుకుపోయిందని అన్నారు. ప్రధాన మంత్రి పోటీతత్వ మరియు సహకార సమాఖ్యను విశ్వసిస్తున్నారని, అందువల్ల రాష్ట్రాలకు కూడా ర్యాంకింగ్ ఉందని ఆయన సూచించారు. రాష్ట్ర ర్యాంకింగ్స్‌లో యూపీ ఇప్పుడు దేశంలోనే 2వ స్థానంలో ఉందన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో స్టార్టప్ ఇండియా పురోగతి సంతృప్తికరంగా ఉందని శ్రీ గోయల్ అన్నారు. యూపి 2020లో అభివృద్ధి చెందుతున్న పర్యావరణ వ్యవస్థ రాష్ట్రంగా ఉంది. అయితే 2021 ర్యాంకింగ్‌లో స్టార్టప్ అప్ ఎకోసిస్టమ్‌లో యూపి అగ్రగామిగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 8 వేల 277 స్టార్టప్‌లు ఉన్నాయని వాటిలో రాష్ట్రం 4వ స్థానంలో ఉందన్నారు. "కొన్ని సంవత్సరాల క్రితం ఇది సాధ్యమవుతుందని ఎవరు భావించి ఉండకపోవచ్చని" శ్రీ గోయల్ అన్నారు. ఈ స్టార్టప్‌లను నడుపుతున్న కొంతమంది యువతీ యువకులతో మాట్లాడే అవకాశం తనకు లభించిందని, వారి ఉత్సాహాన్ని మరియు వారి అద్భుతమైన ఆలోచనలను చూడగలిగానని చెప్పారు.

భారతదేశం గత ఏడాది మూడు ముఖ్యమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసిందని ఈ ఏడాది కూడా రెండు లేదా మూడు ఎఫ్‌టిఎలపై సంతకం జరిగే అవకాశం ఉందని శ్రీ గోయల్ చెప్పారు. యూపిలోని బ్రూవరీలు మరియు వైన్ తయారీ కేంద్రాలకు మార్కెట్ యాక్సెస్, పెట్టుబడులు మరియు సాంకేతికతలు లభిస్తాయి కాబట్టి వారు తలుపులు తెరుస్తారని చెప్పారు. "యూపిలో వివిధ రకాల వైన్‌లను ఉత్పత్తి చేయగల ద్రాక్ష మినహా 28 పండ్లు మరియు 4 రకాల పువ్వులు ఉన్నాయని నేను ఈ రోజు ప్రదర్శనలో చూశాను. ఈ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా సిద్ధంగా మార్కెట్‌లను కలిగి ఉంటాయి "అన్నారాయన.

రేట్లు తగ్గించినప్పటికీ యూపి ఎక్సైజ్ రాబడి మూడు రెట్లు పెరిగిందని శ్రీ గోయల్ తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న నిజాయితీ కలిగిన వ్యవస్థ, మద్యం మాఫియా వెన్ను విరిచడమే ఇందుకు కారణమని ఇది దేశం మొత్తానికి ఉదాహరణ అని చెప్పారు. రాష్ట్రంలో లైసెన్సింగ్ ఆమోదం వేగవంతం కావడం వల్ల రాష్ట్రం పెట్టుబడులను ఆకర్షించడంలో దోహదపడింది మరియు ఇది సాఫీగా మరియు పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందని శ్రీ గోయల్ చెప్పారు.

ఎగుమతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్ని రాష్ట్రాలను ప్రధాన మంత్రి కోరారని ఇందులో యూపీ ముందంజలో ఉందని శ్రీ గోయల్ అన్నారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్‌ను సీరియస్‌గా తీసుకోవడంతో ఇప్పుడు గత 5 సంవత్సరాలలో యూపి నుండి ఎగుమతులు రెట్టింపు అయ్యాయన్నారు. యూపి నుండి టెలికాం పరికరాల ఎగుమతులు 63 రెట్లు పెరిగాయని, ఈ కాలంలో పండ్లు మరియు కూరగాయలు 26 రెట్లు పెరిగాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు.

ఇది నిజంగా అవకాశాల భూమి. ఎందుకంటే మనం సంస్కరణలు అమలు చేస్తున్నాం అదికూడా ఎటువంటి ఒత్తిడి వల్ల కాదు. ఇది అమృత్ కాల్‌లో రాష్ట్రాన్ని మరియు దేశాన్ని ముందుకు తీసుకెళ్తుందని మా నమ్మకం. రాష్ట్రంలో పెద్ద మొత్తంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ శిఖరాగ్ర సమావేశం సరైన సమయంలో జరిగిందని చెబుతూ శ్రీ గోయల్ తన ప్రసంగం ముగించారు.

# పాఠశాల విద్యార్థులకు అడవులను పరిచయం చేసే వనదర్శిని

## –రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అటవీశాఖ, అభినందించిన ఎంపీ సంతోష్ కుమార్

హైదరాబాద్ ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);పాఠశాల విద్యార్థులకు పర్యావరణం ప్రాధాన్యత, అడవులను కాపాడాల్సిన ఆవశ్యకతను క్షేత్రస్థాయిలో పరిచయం చేయాలన్న సంకల్పంతో తెలంగాణ అటవీశాఖ వనదర్శిని కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. వివిధ జిల్లాల్లో నిర్వహిస్తున్న ఈ వనదర్శని కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. తాజాగా మేడ్చల్ జిల్లా అటవీశాఖ నేతృత్వంలో కీసర రిజర్వ్ ఫారెస్ట్ లో వనదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగారం జెడ్పీహెచ్ ఎస్ పాఠశాల విద్యార్థులను కీసర అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడి వివిధ రకాల చెట్లు, ఔషధ మొక్కలను పిల్లలకు అటవీ అధికారులు పరిచయం చేశారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉండే అడవుల వల్ల ఉపయోగాలు, అడవులపై పెరుగుతున్న ఒత్తిడిని విద్యార్థులకు అర్థం అయ్యేలా వివరించారు. రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్న కీసర ఎకో అర్బన్ పార్క్ ను విద్యార్థులు సందర్శించి, కాసేపు సేదతీరారు. విద్యార్థుల వనదర్శిని కార్యక్రమం




వివరాలను ట్విట్టర్ లో షేర్ చేసిన సంతోష్ కుమార్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అటవీశాఖ చాలా మంచి పనిచేస్తోందని, తాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్న అర్బన్ ఎకో పార్క్ ఫలితాలను ఇస్తోందని అని అన్నారు. విద్యార్థులు పర్యావరణ జ్ఞానం పెంచుకోవటం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అవసరం అన్నారు. ఈ వనదర్శని కార్యక్రమం బాగుందని, తాము అడవుల ప్రాధాన్యతతో పాటు, వివిధ రకాల జంతువులు, మొక్కల గురించి నేర్చుకున్నామని, పర్యావరణం ప్రాధాన్యత, కాపాడటంలో తమ బాధ్యత తెలిసి వచ్చిందని విద్యార్థులు ఆనందంగా తెలిపారు. విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించిన అధికారులు బహుమతులు అందించారు. క్లాస్ రూమ్ విద్యతో పాటు విద్యార్థులను ఇలా అడవికి తీసుకువచ్చి పరిచయం చేయటం, వివరించటం చాలా మంచి కార్యక్రమం అని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా డీఎఫ్ఓ జానకిరామ్, స్థానిక అటవీ అధికారులు, నాగారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బొత్సకు స్థానచలనం తప్పదా?

అమరావతి ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఉత్తరాంధ్రా జిల్లాలకు చెందిన బొత్స సత్యనారాయణ బిగ్ పొలిటికల్ ఫిగర్ గా వెలుగొందుతున్నారు. తూర్పు కాపు సామాజికవర్గానికి చెందిన బొత్స ఉత్తరాంధ్రాలో వారికి అనలైన ప్రతినిధిగా ఉంటూ వస్తున్నారు. పెద్ద ఎత్తున ఆ సామాజికవర్గం ఉండడం కూడా ఆయనకు కలిసివస్తోంది.ఇదిలా ఉండగా విజయనగరం జిల్లా రాజకీయాల్లో బొత్స చక్రం గిర్రున గత ఎన్నికల్లో తిరిగింది. తన బంధువులకు టికెట్లు ఇప్పించుకోవడమే కాదు మొత్తం తొమ్మిది అసెంబ్లీ సీట్లు ఒక ఎంపీ సీటుని ఆయన వైసీపీ గెలుచుకోవడంలో కీలమైన పాత్ర పోషించారు.

బొత్స ఎంపీగా మూడు సార్లు ఎమ్మెల్యేగా దశాబ్దానికి పైగా మంత్రిగా పనిచేశారు. వచ్చే ఎన్నికల్లో ఆయన మరోసారి పోటీ చేయడానికి చూస్తున్నారు. చీపురుపల్లిని ఆయన తన సొంత నియోజకవర్గంగా చేసుకున్నారు. 2004లో ఫస్ట్ టైం ఆయన అక్కడ నుంచి గెలిచారు. 2009లో మరోసారి జెండా ఎగరేశారు. 2014లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి విభజన కారణంగా ఓటమి చవిచూశారు.ఆ తరువాత వైసీపీలోకి మారి 2019లో బంపర్ విక్టరీని సాధించారు. లెక్క ప్రకారం 2024లో ఆయన చీపురుపల్లి నుంచే పోటీ చేయాలి. కానీ అక్కడ బొత్సకు డౌట్ కొడుతోందా అన్న చర్చ అయితే మొదలైంది. బొత్స సేఫ్ జోన్ కోసం చూసుకుంటున్నారు అని అంటున్నారు. చీపురుపల్లిలో టీడీపీ గ్రాఫ్ బాగా పెరిగింది అని అంటున్నారు. అలగే జనసేన కూడా అక్కడ గట్టిగానే ఉందని చెబుతున్నారు.బొత్స ఉంటే అమరావతి లేకుంటీ విజయనగరం అన్నట్లుగా ఉంటున్నారు. తన వారికి చీపురుపల్లి బాధ్యతలు అప్పగించారు. ఈ మధ్యలో వైసీపీ నుంచి చాలా మందిని తెలుగుదేశం లాగేసింది. అక్కడ వచ్చే ఎన్నికల్లో మాజీ మంత్రి కిమిడి మృణాళిని కుమారుడు నాగార్జున పోటీ చేయాలని చూస్తున్నారు. గత ఎన్నికల్లో ఓడిన నాగార్జున గ్రౌండ్ వర్క్ బాగా చేసుకున్నారు.దాంతో పాటు జనసేన కూడా కలిస్తే బొత్సకు ఇబ్బంది అని నివేదికలు వస్తున్నాయట. దాంతో ఆయన చూపు ఎస్ కోట మీద పడింది అని అంటున్నారు. ఎస్ కోట సిట్టింగ్ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఉన్నారు. ఆయన మీద సొంత పార్టీలోనే వ్యతిరేకత ఉంది అంటున్నారు. ఆయన లోకల్ గా ఉండకపోవడం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తీర్చకపోవడంతో సాదర జనాలు పార్టీ జనాలూ కూడా ఆయన పట్ల విముఖంగా ఉన్నారని అంటున్నారు.వైసీపీ సర్వేలలో కూడా అదే తేలడంతో ఆయనకు టికెట్ దక్కడం కష్టమని అంటున్నారు. దాంతో ఆ ప్లేస్ లోకి బొత్స రావాలని చూస్తున్నారు. ఎస్ కోట నుంచి తాను పోటీ చేస్తే బాగుంటుందని ఆయన ఆలోచిస్తున్నారు అని ప్రచారం అయితే సాగుతోంది. మరి ఆయన ఎస్ కోటను ఎంచుకుంటే చీపురుపల్లి నుంచి ఎవరు వైసీపీ తరఫున పోటీ చేస్తారు అన్నది కూడా చూడాలని అంటున్నారు.సీనియర్ మంత్రి తన గెలుపు కోసం వేరే నియోజకవర్గానికి బదిలీ అయితే ప్రత్యర్ధి పార్టీలకు ఏ రకమైన సంకేతం ఇస్తున్నట్లు అన్నది చూడాలి. అలాగే అది వైసీపీకి ఇబ్బంది అవుతుందా అన్న చర్చ కూడా ఉంది ఏది ఏమైనా జగన్ చీపురుపల్లి నుంచి బొత్సను పోటీ చేయమంటే ఆయన ఏమి చేస్తారు అన్నది కూడా చూడాల్సి ఉందని అంటున్నారు.

# ఏపీ సీఐడీ మాజీ డీజీ పీవీ సునీల్ కుమార్‌పై చర్యలు

### -ఏపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి కేంద్ర హోం శాఖ లేఖ

అమరావతి ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఏపీ సీఐడీ మాజీ డీజీ పీవీ సునీల్ కుమార్ పై చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి కేంద్ర హోం శాఖ లేఖ రాసింది. సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సీఐడీ అధికారులు అక్రమ అరెస్టులు, కస్టోడియల్ టార్చర్‌కు పాల్పడుతున్నారని గతేడాది కేంద్ర హోంశాఖకు హైకోర్టు న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ లేఖ రాశారు. సీఐడీ విభాగంలో కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్న తీరు ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా ఉందని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కార్యకర్తలపై అక్రమ కేసులు మోపుతున్నారని, అధికార పార్టీ నేతల ఆదేశాల మేరకే ఈ విధంగా చేస్తున్నారని హోంశాఖకు ఫిర్యాదు చేశారు. గతేడాది అక్టోబర్‌లో రాసిన లేఖపై కేంద్రహోంశాఖ కార్యదర్శి స్పందించారు. ఈరోజు పోస్టులో లక్ష్మీనారాయణ, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అధికారులు లేఖ పంపారు. కేంద్ర హోంశాఖ పంపిన లేఖలో ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

# పూణెలో నదీ తీర ప్రాంత నగరాల సభ్యుల వార్షిక -ధార సమావేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:నగరాల మీదుగా ప్రవహిస్తున్న నదుల పరిరక్షణ, అభివృద్ధి కోసం సమగ్ర కార్యాచరణ రూపొందించడానికి నదీ తీర ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు సభ్యులు ( ఆర్‌సిఎ )గా ఏర్పాటైన"ధార " వార్షిక సమావేశం 2023 ఫిబ్రవరి 13,14 తేదీల్లో పూణేలో జరగనున్నది. జాతీయ పట్టణ వ్యవహారాల సంస్థ ( ఎన్ఐయుఏ) సహకారంతో నేషనల్ మిషన్ ఫర్ గంగ (ఎన్ఎంసిజి ) నిర్వహిస్తున్న సమావేశం తొలిరోజున కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ కీలక ఉపన్యాసం ఇస్తారు. గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ కౌశల్ కిషోర్ రెండో రోజున ప్రసంగిస్తారు. దేశంలో నదీ తీరాల వెంబడి ఉన్న 95 నగరాలకు చెందిన కమిషనర్లు, చీఫ్ ఇంజినీర్లు, సీనియర్ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు సభ్యులుగా "ధార" ఏర్పాటయింది. సమావేశంలో స్థానిక నీటి వనరుల, యాజమాన్యం పై విస్తృత స్థాయి చర్చలు జరుగుతాయి.

జీ-20 అధ్యక్షత వహిస్తున్న భారతదేశం పట్టణ ప్రాంతాల అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో జరుగుతున్న ''ధార'' సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.జీ-20 లో భాగంగా ఏర్పాటైన యూ-20 పట్టణ ప్రాంతాల్లో నీటి భద్రత కల్పించే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని నిర్ణయించింది. దీనికోసం నదుల పాత్ర కీలకంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రెండు రోజుల పాటు జరిగే "ధార 2023'' సమావేశాల్లో నదుల నిర్వహణ అంశాలపై ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. మొదటి రోజున ' నది సంబంధిత అంశాలపై నిర్వహించిన అధ్యయనాలు-ఫలితాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తారు. నదస్సులు, నదులు,చెరువుల పునరుజ్జీవనంతో సహా పట్టణ నదుల నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలు, సమస్య పరిష్కారానికి వినూత్నంగా చేయాల్సిన చర్యలు,వికేంద్రీకృత జల వనరుల నిర్వహణ, నది సంబంధిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి, భూగర్భ జల వనరుల నిర్వహణ, వరదల నివారణ తదితర అంశాలపై చర్చలు జరుగుతాయి. నదుల నిర్వహణకు సంబంధించి డెన్మార్క్ లో అమలు జరుగుతున్న విధానాలు,నీటి పునర్వినియోగం కోసం ఇజ్రాయెల్‌లో ఉపయోగిస్తున్న విధానాలు, మైదాన ప్రాంతాల్లో వరదల నివారణ కోసం నెదర్లాండ్‌లో అమలు జరుగుతున్న విధానాలు,నదుల పరిరక్షణ కోసం అమెరికా అమలు చేస్తున్న పర్యవేక్షణ విధానం,కాలుష్య నివారణ కోసం జపాన్ అనుసరిస్తున్న విధానాలు, ఆస్ట్రేలియాలో అమలులో ఉన్న సున్నిత నగర ప్రణాళిక లాంటి అంశాలను సదస్సులో చర్చిస్తారు.

నదస్సు రెండో రోజున ప్రతినిధులు యోగా కార్యక్రమంలో పాల్గొని ముల్లా ముత్తా నది తీరాన్ని సందర్శిస్తారు. ముల్లా ముత్తా నదిలో కాలుష్య నివారణ కోసం అమలు చేయనున్న ప్రాజెక్టుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పూణే లో 2022 మార్చి నెలలో శంకుస్థాపన చేశారు. జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక కింద చేపట్టిన ప్రాజెక్టు లో 990.26 కోట్ల రూపాయల ఖర్చుతో 396 ఎంఎల్డీ సామర్ధ్యంతో 11 మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లను ఏర్పాటు అవుతాయి.

రెండు రోజుల పాటు జరిగే సదస్సులో మహారాష్ట్ర ముఖ్య కార్యదర్శి శ్రీ మనుకుమార్ శ్రీవాస్తవ, ఎన్ఎంసిజి డైరెక్టర్ జనరల్ శ్రీ జి. అశోక్ కుమార్, మహారాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి సోనియా సేథి, గృహ నిర్మాణం,పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి డి . తారా తదితరులు పాల్గొంటారు.

పట్టణ ప్రాంతాల నదుల యాజమాన్యం అంశంపై మున్సిపల్ కమిషనర్లు చర్చలు జరిపి పరిష్కరణ మార్గాలను సూచించడానికి "ధార 2023'' అయ్యింది. ఆర్‌సిఎ ప్రతినిధులు ( కమిషనర్లు/ అదనపు కమిషనర్ లు),కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, ఎన్ఈయూఏ, ఎన్ఎంసీజీ ప్రతినిధులు, విద్యార్థులు, జాతీయ స్థాయి నిపుణులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, ప్రైవేటు రంగ ప్రతినిధులు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు సమావేశాలకు హాజరవుతారు.

కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయడం, పట్టణ నదుల నిర్వహణకు సంబంధించిన ప్రాధాన్యతలను నిర్ణయించడానికి ఎంపిక చేసిన రాష్ట్రాల (ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణ మరియు తమిళనాడు)ముఖ్య కార్యదర్శులు (పట్టణాభివృద్ధి) ప్రత్యేకంగా సమావేశం అవుతారు. తమ నగరాల్లో నదులు, నీటి వనరులకు సంబంధించి చేపట్టిన పనులను ఆర్ఏసి సభ్యులు వివరిస్తారు.

నది-సంబంధిత ప్రాజెక్టులను అమలు చేయడానికి అవసరమైన నిధుల సమీకరణ కోసం ఏర్పటయ్యే నదస్సులో నది-సంబంధిత ప్రాజెక్టలకు అందుబాటులో ఉన్న వివిధ జాతీయ , అంతర్జాతీయ నిధులపై దృష్టి సారిస్తుంది.ఈ సదస్సులో ప్రపంచ బ్యాంకు , ఏజెన్సీ ఫ్రాంకైస్ డి డెవలప్‌మెంట్ (ఎఈఆ), డెన్మార్క్ ఎంబసీ, డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (ఆఈఎఆ), ఐటచి డెవలప్‌మెంట్ బ్యాంక్, జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (ఏఎం) ఇతర ప్రైవేటు సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. సాంకేతిక, ఆవిష్కరణ రంగాలకు సంబంధించి జరిగే చర్చల్లో నదుల యాజమాన్యం, నిర్వహణకు సంబంధించి అందుబాటులో ఉన్న సరికొత్త అత్యాధునిక సాంకేతికతల ప్రదర్శన రూపంలో చర్చిస్తుంది. సమాచార సేకరణ పర్యవేక్షణ, నది తీర ప్రాంత అభివృద్ధి, పర్యావరణహిత నిర్మాణ సామగ్రి, ఘన మరియు ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ, యాప్‌లు,ఐటీ -సంబంధిత ఆవిష్కరణలకు సంబంధించిన అంశాలను సమావేశంలో చర్చిస్తారు.

వివిధ వర్గాల నుంచి ఎంపిక చేసిన చెందిన విద్యార్థులు పట్టణ నదుల నిర్వహణపై తమ ఆలోచనలను 'యూత్ ఫర్ రివర్స్' సదస్సులో వివరిస్తారు.

ఆర్‌సిఎ సభ్యులు తమ నగరాల్లో పట్టణ నదుల నిర్వహణ కోసం ప్రగతిశీల విధానాలు అమలు చేసేలా చూడాలన్న లక్ష్యంతో "ధార 2023" ను నిర్వహిస్తున్నారు.లో నది నిర్వహణకు సంబంధించిన అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, సవాళ్లు పరిష్కారానికి ఆచరణ సాధ్యమైన సూచనలను "ధార 2023" అందిస్తుంది. సూచనలు, సలహాలు ఆధారంగా సమర్ధవంతమైన కార్యాచరణ ప్రణాళికను ఎన్ఈయూఏ రూపొందిస్తుంది. . ఈ నగరాలు తమ స్థానిక నదుల నిర్వహణను మెరుగుపరచడానికి అనుసరించాల్సిన సాంకేతిక పరిష్కార మార్గాల అభివృద్ధిపై "ధార 2023" దృష్టి సారిస్తుంది.

రివర్ సిటీస్ అలయన్స్ (ఆర్‌సిఎ)2021లో 30 నగరాలతో ప్రారంభమైంది . ప్రస్తుతం 95 నగరాలు ఆర్‌సిఎ సభ్యులుగా ఉన్నాయి. ఆర్‌సిఏను నవంబర్ 2021న శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ భారతదేశంలోని నదీ నగరాల కోసం అర్బన్ నదుల స్థిరమైన నిర్వహణ కోసం సమాచారాన్ని రూపొందించడానికి, చర్చించడానికి మరియు మార్పిడి చేయడానికి ఒక ప్రత్యేక వేదికగా ప్రారంభించారు. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ఏర్పడిన ఆర్‌సిఏ రెండు మంత్రిత్వ శాఖలు- జలశక్తి మంత్రిత్వ శాఖ, గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కలిసి సాధించిన విజయాలకు నిదర్శనం.నెట్‌వర్కింగ్, సామర్థ్య పెంపుదల, సాంకేతిక సహకారం అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ సమావేశాలను నిర్వహిస్తారు.

# వైభవంగా భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి స్నపన తిరుమంజనం



తిరుపతి, ఫిబ్రవరి 14: కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు మంగళవారం స్నపన తిరుమంజనం (పవిత్రస్నానం) శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రధాన కంకణభట్టర్ శ్రీ బాలాజి రంగాచార్యులు ఆధ్వర్యంలో ఈ విశేష ఉత్సవం నిర్వహించారు. ఇందులో ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, పెరుగు,తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. ఈ సందర్భంగా తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలానూక్తం, పంచశాంతి మంత్రములు, దివ్యప్రభందములోని అభిషేక సమయంలో అనుసంధానము చేసే పాశురాలను అర్చకులు పఠించారు. ఈ వేడుకలో ఒకో క్రతువులో ఒక మాల వంతున రోజా ,సంపంగి తదితర ఏడు రకాల మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గురుమూర్తి, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కండిషన్‌లో లేని వెహికిల్‌ను వదిలివెళితే.. తగులబెడుతా..

### -ప్రోటోకాల్ అధికారులకు రాజాసింగ్ హెచ్చరిక

హైదరాబాద్ ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం బైక్ పై వెళుతున్నారు. కండిషన్‌లో లేని తన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ప్రగతి భవన్ వద్ద వదిలేశారు. దీంతో ప్రోటోకాల్ అధికారులు రాజాసింగ్ వాహనానికి రిపేర్ చేయించారు. వాహనాన్ని తీసుకువెళ్లమని రాజాసింగ్‌కు అధికారులు కబురు చేస్తున్నారు. అయితే పాత వాహనం తనకు వద్దని.. కొత్తది కాకపోయినా పర్లేదు కానీ.. కనీసం కండిషన్‌లో ఉన్న వెహికిల్ కావాలని రాజాసింగ్ అంటున్నారు. ఒకవేళ పాత వాహనాన్ని బలవంతంగా అధికారులు తన నివాసం వద్ద వదిలివెళితే.. ప్రగతి భవన్ దగ్గర వాహనాన్ని తగులబెడుతానని రాజాసింగ్ అధికారులకు హెచ్చరించారు. దీంతో వ్యవహారం ఎమ్మెల్యే రాజాసింగ్ వర్సెస్ ప్రోటోకాల్ అధికారులుగా మారింది.

కాగా 'బండి కాదు.. మొండి ఇది సాయం చేయండి' అని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇప్పటికే పలుమార్లు తన బుల్లెట్ ప్రూఫ్ వాహనం విషయంలో అభ్యర్థించారు. ఇప్పటికే ఈ వాహనం మూడు సార్లు ఆగిపోయి మొండికేసింది. ఈ క్రమంలో తన వాహనాన్ని మార్చాలంటూ ప్రభుత్వాన్ని కోరినా ఫలితం లేకుండా పోయింది. దీంతో రాజాసింగ్.. వినూత్న నిరసనకు తెరదీశారు. ప్రభుత్వం తనకు కేటాయించిన బులెట్ ప్రూఫ్ కారును ప్రగతి భవన్ గేటు దగ్గర వదిలేశారు. పోలీసులు కారును స్వాధీనం చేసుకుని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలకు కూడా రాజాసింగ్ తన బుల్లెట్ బండిపై వెళ్లిన విషయం తెలిసిందే.

# కొండగట్టుకు సీఎం కేసీఆర్.. ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు



కరీంనగర్, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): జగిత్యాల జిల్లాలోని పుణ్యక్షేత్రం కొండగట్టుకు బుధవారం సీఎం కేసీఆర్ రానున్నారు. ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నారు. సీఎం కేసీఆర్ కొండకట్టుకు వస్తుండడంతో మంగళవారం హెలిప్యాడ్‌ను, ఏర్పాట్లను కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ పరిశీలించారు. వారి వెంట జడ్పీటీసీ రాం మోహన్ రావు, కొడిమ్యాల ఎంపీపీ మెన్నేని స్వర్ణలత రాజ నర్సింగరావు, సర్పంచులు తిరుపతి, సుదర్శన్ తదితరులు ఉన్నారు. వాస్తవానికి మంగళవారమే సీఎం కొండగట్టుకు రావాల్సి ఉండగా అనివార్యకారణాలతో పర్యటన బుధవారం వాయిదా పడింది. సీఎం పర్యటన సందర్భంగా ఇప్పటికే అధికార, పోలీసు యంత్రాంగం పలుమార్లు ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు.

# ఆ అయిదు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే-పార్టీ నేతలకు జగన్ టార్గెట్ ఫిక్స్

అమరావతి, ఫిబ్రవరి 14:అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు గెలుపొం దడం పెద్ద సవాల్‌గా మారింది. అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు రావడం ఒకవైపు, వైయస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వై నాట్ 175 నినాదంతో ముందుకు వెళ్లడం మరోవైపు ఉండటంతో ఈ ఎన్నికలను అధినేత సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపిస్తోంది. అయితే, ఉపాధ్యాయులతో వైరం ఒకవైపు, జాబ్ కేలండర్ సకాలంలో భర్తీ చేయలేదనే ఆరోపణలు మరోవైపు ఇప్పుడు అధికార పార్టీని ఆలోచనలో పడేస్తున్నాయి. ఈక్రమంలోనే ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుతం మండ లిలో ఖాళీగా ఉన్న రెండు టీ-చర్ల, మూడు పట్టభద్రుల ఎమ్మె ల్సీ స్థానాలు వెరసి మొత్తం ఐదు స్థానాలను ఎట్టిపరిస్థితుల్లోనూ -క్లై-వసం చేసుకునేందుకు కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో ఈ ఐదు స్థానాలను అధికార వైకాపా కనుగ తన ఖాతాలో వేసుకోగలిగితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో తమ విజయం ఇప్పటికంటే ఘనంగానే ఉంటుం దన్న ప్రచారం కూడా పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఈనేప థ్యంలో ఈ ఐదు స్థానాల్లో పైచేయి సాధించేందుకు ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నారు.

ఇప్పటికే విడుదలైన నోటిఫికేషన్

శాసనమండలిలో ఖాళీగా ఉన్న 13 స్థానాలకు మార్చి 13న ద్వైవార్షిక ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల సంఘం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో ఎనిమిది స్థానాలు స్థానిక సంస్థల నుండి ఎన్నుకోవాల్సి ఉండగా మిగి లిన ఐదింటిలో రెండు ఉపాధ్యామ, మూడు గ్రాడ్యుయేట్ల స్థానాల నుండి అభ్యర్థులను ఎన్నుకోవాల్సి ఉంది. అయితే, ఇప్పటికే స్థానిక సంస్థల్లో అధికార వైకాపాకు విస్పష్టమైన మెజారిటీ- ఉన్నందున మొత్తం ఎనిమిది స్థానిక అధికార ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం పెద్ద కష్టమైన పనేమీ కాదు. అయితే, ప్రకాశం -నెల్లూరుచిత్తూరు, కడప- అనంతపురం- కర్నూలు, శ్రీకాకుళం- విజయన గరం- విశాఖపట్నం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు, కడప-అనం తపురం- కర్నూలు అనే రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో గెలుపు అంత సులువు కాదనే అంశం ఇప్పుడు తెరపైకి వస్తోంది.

గెలుపు ప్రాథమ్యాలపై చర్చ

అటు ఉపాధ్యాయ, ఇటు పట్టభద్రుల స్థానాల గెలుపుపై విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్సీ అంశం నుండి ప్రభుత్వంతో విబేధాలు ప్రారంభయ్యాయి. అవి చిలికి చిలికి గాలివానలా మారి ఉపాధ్యాయులను ఎన్నికల విధులనుండి తప్పించే వరకూ వెళ్లాయి. ఇదే క్రమంలో ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ పెట్టడంతో వారు ప్రభుత్వ తీరుపై మరింత మండిపడుతున్నారు. దీనికితోడు వేతనాలు సకాలంలో అందడంలేదని, పెండింగ్ డీఏలు ఇవ్వలేదన్న అసంతృప్తులు ఉపాధ్యాయ వర్గాల్లో పెద్ద ఎత్తున ఉన్నాయి. ఈక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానా ల్లో గెలుపొందడం అంత తేలికైన పనికాదని అంటున్నా రు. అదే సమయంలో ఉపా ధ్యాయులకు పనిభారం తగ్గించడంతోపాటు బదిలీల అంశంలోనూ ప్రభుత్వం వారికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుందని మరో వాదన కూడా ఉంది. అంతేకాకుండా మెటర్నిటీ లీవుల అంశం లోనూ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిం చిన నేపథ్యంలో గెలుపు భారీ స్థాయిలో కాకపోయినా, గెల వడం ఖాయమనే వాదన కూడా లేకపోలేదు. ఇక పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించి జాబ్ కేలండర్ ప్రతి ఏటా విడుదల చేస్తామని ప్రకటించి దానిని అరకొరగా విడుదల చేస్తున్నారని నిరుద్యోగ యువతను ప్రతిపక్షాలు ప్రేరేపిస్తున్నాయి. ఇది ఎంత మేరకు ప్రభావం చూపుతుందన్నది చర్చ నీయాంశంగా మారింది. ఈక్రమంలోనే గత మూడేళ్లలో

ప్రభుత్వం సచివాలయాల్లో 1.25 లక్షల ఉద్యోగాలు కల్పిం చిందని, వివిధ శాఖల్లో 2.06 లక్షల ఖాళీలను భర్తీ చేసిందని, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన అదనంగా 3.71 లక్షల ఉద్యో గాలు కల్పించిందని వైఎస్సార్‌సీపీ నేతలు చెబుతున్నారు. ఇది ఓటర్లపై, ముఖ్యంగా గ్రాడ్యుయేట్లపై సానుకూల ప్రభా వం చూపుతుందని వారు భావిస్తున్నారు.

నేతలకు సీఎం దిశానిర్దేశం

అటు ఉపాధ్యాయ, ఇటు పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ వైయస్సార్సీపీ ప్రతిపాదించిన అభ్య ర్థులు గెలిచి తీరాలని, ఆమేరకు స్థానిక నేతలు చిత్తశుద్ధితో కృషి చేయాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆయా నియోజకవర్గాల్లోని నేతలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. గడచిన మూడు సంవత్సరాల పది నెలల కాలంలో ప్రభుత్వం ఏం చేసిందనే దాని తోపాటు కరోనా ఆర్థిక సంక్షోభాన్ని సైతం తట్టుకుని ఉద్యోగుల వేతనాల్లో ఎటు వంటి కోత లేకుండా అం దించిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్న విషయాన్ని వారిలోకి తీసు కెళ్లాలని ఆయన సూచిం చినట్లు తెలుస్తోంది. ఇక అధికారంలోకి వచ్చిన వెంటనే 17 శాతం ఐఆర్ ఇచ్చిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించినట్లు సమాచారం.

ఇక ఉద్యోగుల సంక్షేమంకోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉందని, నివాస స్థలాల కేటాయింపులో వారికి ప్రా ధాన్యత కల్పించడం వంటి అనేకానేక కార్యక్రమాలు చేపట్టిం దని, ఒకటి రెండు అంశాల్లో చేయలేకపోయినా వాటిని కూడా వీలైనంత త్వరలోనే పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకుంటా మని వారికి చెప్పాలని సీఎం స్థానిక నేతలను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఆమేరకు నేతలు వెంటనే కార్యోన్ముఖులు కావాలని ఆయన స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం.

# మకర వాహనంపై కపిలతీర్థ విభుడు



తిరుపతి, ఫిబ్రవరి 14:తిరుపతి లోని శ్రీ కపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన మంగళవారం ఉదయం శ్రీ కపిలేశ్వరస్వామివారు సోమస్కందమూర్తిగా కామాక్షి అమ్మవారి సమేతంగా మకర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. మకరం గంగాదేవికి నిత్యవాహనం. గంగ పరమశివుని శిరస్సుపై నివసిస్తోంది. గంగాదేవి వాహనమైన మకరం తపమాచరించి శివానుగ్రహాన్ని పొంది ఆ పరమశివునికి వాహనమైందని శైవాగమాలు తెలియజేస్తున్నాయి. మకరం జీవప్రకృతికి ఉదాహరణ. భగవంతుని ఆశ్రయించినంత వరకు జీవుడు నీటిలో మొసలిలా బలపరాక్రమంతో జీవించవచ్చు. అనంతరం ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. శ్రీ సోమస్కందమూర్తి, శ్రీ కామాక్షిదేవి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ శ్రీ దేవేంద్ర బాబు, ఏఈఓ పార్థ సారధి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్స్ పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

# డిజిటల్ సాధికారతను ప్రోత్సహించడం.. ఎంఎస్ఎంఈల వ్యాపారం సులభతరం..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:డిజిటల్ సాధికారతను ప్రోత్సహించడానికి మరియు ఎంఎస్ఎంఈల వ్యాపారాన్ని సులభతరం చేయడానికి ప్రభుత్వం వివిధ డిజిటల్ కార్యక్రమాలను చేపట్టింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ఉదయం రిజిస్ట్రేషన్ పోర్టల్, ఎంఎస్ఎంఈ ల ఫిర్యాదుల పరిష్కారం కోసం ఛాంపియన్స్ పోర్టల్, ఆన్‌లైన్ సేకరణ కోసం ప్రభుత్వ ఇ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం), డిస్కౌంట్ ఇన్‌వాయిస్‌ల కోసం ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్ (టీఆర్ఈడీఎస్) మరియు ఆన్‌లైన్ మార్కెటింగ్ సపోర్టింగ్ కోసం ఎంఎస్ఎంఈమార్ట్ డాట్ కామ్ ఉన్నాయి. దీనికి తోడుగా కేంద్ర మంత్రిత్వ శాఖలు / విభాగాలు / సీపీఎస్ఈలు / రాష్ట్ర ప్రభుత్వాలు మొదలైన వాటి ద్వారా ఆలస్యంగా చెల్లింపులకు సంబంధించిన దరఖాస్తులను పూరించడానికి మైక్రో మరియు స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఈలు) మరియు ఎంఎస్ఎంఈ సమాధాన్ పోర్టల్, సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ (సీపీఎస్ఈలు) ద్వారా సేకరణను పర్యవేక్షించడానికి ఎంఎస్ఎంఈ సంబంధ్ మొదలైనవి అందుబాటులోకి తెచ్చారు. దీనికి తోడు దేశంలోని ఎంఎస్ఎంఈల డిజిటల్ సాధికారత కోసం ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఎంఎస్ఎంఈ ఛాంపియన్స్ స్కీమ్‌ల క్రింద అవగాహన పెంచడానికి, క్లౌడ్ ఆధారిత డిజిటల్ సాధనాల వినియోగానికి 'డిజిటల్ ఎంఎస్ఎంఈ స్కీమ్'ను కూడీ అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటి వరకు రూ. 1.39 కోట్ల ఎంఎస్ఎంఈలు ఉదయం రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు చేయబడ్డాయి. వివిధ కార్యక్రమాల ద్వారా మరింత ప్రయోజనం పొందుతున్నాయి. కేంద్ర మంత్రిత్వ శాఖలు / విభాగాలు / సీపీఎస్ఈల నుండి కొనుగోళ్లు సుమారు రూ. 139 018 కోట్లుగా నిలిచాయి. ఎంఎస్ఈల కోసం పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ (పీపీపీ) కింద ఎంఎస్ఈదరఖాస్తులను ఎంఎస్ఈఎఫ్‌సీ కౌన్సిల్ పరిష్కరించింది. సూక్ష్మ చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భాను ప్రతాప్ సింగ్ వర్మ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారం అందించారు.

# ప్రభుత్వ రంగం కింద స్టీల్ ఉత్పత్తి యూనిట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:దేశంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఏఐఎల్), రాష్ట్రీయ ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) అన్న రెండు ప్రభుత్వ రంగ స్టీల్ ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయి.

కాగా,01.02.2023 నాటికి ఎస్ఏఐఎల్ ప్లాంట్లు లేదా యూనిట్లలో 65,895మంది కాంట్రాక్టు కార్మికులు ఉండగా, ఆర్ఐఎన్ఎల్‌లో 16,368 మంది ఉన్నారు.

గత ఐదేళ్లలో ఏ స్టీల్ సంస్థ కూడా తన కార్యకలాపాలను నిలిపివేయలేదు. అయితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్ఏఐఎల్ ప్లాంటు లేదా యూనిట్ అయిన విశ్వేశ్వరయ్య ఐరన్‌డ స్టీల్‌ప్లాంట్ మూసివేతకు ప్రక్రియ ప్రారంభం అయింది.

ప్రభుత్వరంగ యూనిట్‌ను మూసివేస్తే కాంట్రాక్టు కార్మికులకు వర్తించే చట్టం, దానికోసం రూపొందించిన నిబంధనలకు అనుగుణంగా పరిహారాన్ని అందిస్తారు.

ఈ సమాచారాన్ని కేంద్ర స్టీలు ఉ గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి శ్రీ ఫగ్గనన్ సింగ్ కులస్తే రాజ్యసభకు నేడు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వివరించారు.

# వంటేరు ప్రతాప్ రెడ్డి వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి

మేడ్చల్ ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాష్ట్ర అటవీశాఖ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. మంగళవారం ఉదయం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్తెల్లి 44వ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. మేడ్చల్ పట్టణానికి చెందిన గౌర్ల నర్సింలు(48) ఘటనా స్థలిలోనే మృతి చెందాడు. ప్రమాద సమయంలో ప్రతాప్ రెడ్డి వాహనంలోనే ఉన్నారు. ప్రతాప్ రెడ్డిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని ప్రతాప్ రెడ్డిని వేరే వాహనంలో పంపించివేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పర్యాటకుల భద్రత కోసం టూరిస్ట్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు.. సీఎం జగన్



అమరావతి, ఫిబ్రవరి 14:పోలీస్ శాఖలో అనేక సంస్కరణలు తీసుకువచ్చామని, పోలీసులు మీ స్నేహితులు అనే భావన తీసుకురాగలిగామని, పర్యాటకుల భద్రత కోసం టూరిస్ట్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలు, ప్రముఖ దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ స్టేషన్లను తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైయస్ జగన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈసందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ? పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మరోమంచి కార్యక్రమానికి శ్రీకారం చుదుతున్నామన్నారు. పోలీస్ శాఖలో ఇంతకుముందు ఎప్పుడూ జరగని విధంగా, గతానికి భిన్నంగా ఎన్నెన్నో మంచి సంస్కరణలు అమలవుతున్నాయన్నారు. ఎప్పుడూ చూడని విధంగా గ్రామస్థాయిలోనే మహిళా పోలీసులు సచివాలయాల ద్వారా అందుబాటులోకి వచ్చారన్నారు. జీరో ఎఫ్ఐఆర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పోలీస్ స్టేషన్లలోకి వెళ్లినప్పుడు అక్కడ ప్రవర్తించే తీరు, రిసెప్షన్ గతానికి, ఇప్పటికీ వివరీతమైన తేడా కనిపించేలా.. పోలీసులు మీ స్నేహితులు అని చెప్పే భావన కల్పిస్తూ రిసెప్షనిస్టులను కూడా నియమించామన్నారు.

ఫిర్యాదు చేసేందుకు వచ్చేవారికి తోడుగా నిలబడే కార్యక్రమం జరుగుతుందన్నారు. గతంలో ఎప్పుడూ లేనట్టుగా దిశ యాప్‌ను 1.20 కోట్ల పైచిలుకు మంది డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్టర్ అయ్యారన్నారు. సెల్‌ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే పోలీసులు, ప్రభుత్వమే మీకు అన్నగా, తమ్ముడిగా ఉంటుందనే భరోసా కల్పించామన్నారు. ఆపదలో ఉన్నప్పుడు 5సార్లు ఫోన్ షేక్‌చేసినా, ఎస్ఓఎస్ బటన్ నొక్కినా 10 నిమిషాల్లోపే పోలీసులు ఆ మహిళ దగ్గరికి చేరుకుంటారన్నారు. ఎస్ఓఎస్ లేదా ఫోన్ షేక్ చేసిన 5?10 సెకన్ల వ్యవధిలో పోలీసుల నుంచి ఆ మహిళకు ఫోన్ వెళ్తుందన్నారు. ఫోన్ రిప్లయ్ చేయకపోతే వెంటనే ఆ స్థలానికి వెళ్లి తోడుగా నిలబడుతున్నారన్నారు. ఇలా దాదాపు 6 వేల మందికి మంచి జరిగిందన్నారు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా పోలీస్ శాఖలో మార్పులు కనిపిస్తున్నాయన్నారు. పోలీస్ శాఖలో సంస్కరణల్లో భాగంగా 20 పర్యాటక ప్రాంతాల్లో టూరిస్ట్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. పర్యాటక ప్రదేశాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించే వారి భద్రత కోసం ప్రత్యేకంగా దాదాపు 20 లొకేషన్లను గుర్తించి, ఆ ప్రదేశాల్లో కియాస్క్‌లను పెట్టి, ఆ ప్రదేశాల్లో పెట్టిన కియాస్క్‌లు స్థానిక పోలీస్‌స్టేషన్లతో అనుసంధానమై ఉన్నాయన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లకు 20 అదనపు పోలీస్‌స్టేషన్లుగా పర్యాటక ప్రాంతాల్లో స్టేషన్లు పనిచేస్తాయన్నారు. ప్రతి కియాస్క్‌లో దాదాపు 6మంది సిబ్బంది, అందులో 8 గంటల షిఫ్ట్‌లో ఇద్దరు, 12 గంటల షిఫ్ట్ డ్యూటీలో ముగ్గురు పనిచేసే విధంగా రూపకల్పన చేశామన్నారు. వీరిని పర్యవేక్షించేందుకు ఎస్ఐ, ఏఎస్ఐ స్థాయి అధికారిని నియమించామన్నారు. వీరికి సంబంధించి ప్రత్యేకంగా టెలిఫోన్ నంబర్ కేటాయించాం. దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే పోలీస్ సోదరుడు మీకు అండగా నిలబడినట్టే అనే భావన కల్పించేలా, దిశ యాప్ ఎలా డౌన్‌లోడ్ చేయాలో చెప్పే కరపత్రాలను కియాస్క్‌లో అందుబాటులో ఉంచామన్నారు. టూరిస్ట్ పోలీస్ స్టేషన్లలో పనిచేసే సిబ్బందికి ప్రత్యేకమైన టెలిఫోన్ నంబర్, రేడియో సెట్, ఫస్ట్‌ఎయిడ్ బాక్స్, ఆ ప్రాంతానికి సంబంధించిన మ్యాప్, ఎమర్జెన్సీ టెలిఫోన్ నంబర్, వెహికిల్స్ అన్నీ ఇచ్చామన్నారు.

# నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ ద్వారా వాణిజ్య స్థిరాస్తుల కొనుగోలుకు సీసీఐ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ వాణిజ్య స్థిరాస్తుల కొనుగోలుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది, ప్రతిపాదిత లావాదేవీలు ఇలా ఉంటాయి:

దక్ష ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్, సెలెక్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, చిత్రాలి ప్రాపర్టీస్ యివేట్ లిమిటెడ్, నమన్ మాల్ మేనేజ్‌మెంట్ కంపెనీ యివేట్ లిమిటెడ్, సి.ఎస్.జె. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యివేట్ లిమిటెడ్, యుథోరియా డెవలపర్స్ ప్రయివేట్ లిమిటెడ్, సఫరీ రిట్రీట్స్ ప్రయివేట్ లిమిటెడ్, విజయా ప్రొడక్షన్స్ ప్రయివేట్ లిమిటెడ్, విజయా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, విజయా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, సత్రియా డెవలప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ లిమిటెడ్, నెక్సస్ ఉదయపూర్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్, నెక్సస్ హైదరాబాద్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్, నెక్సస్ మంగళూరు రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్, నెక్సస్ మైసూర్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్, నెక్సస్ శాంతినికేతన్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్, నెక్సస్ మాల్స్ వైట్‌ఫీల్డ్ ప్రైయివేట్ లిమిటెడ్ మరియు నెక్సస్ సౌత్ మాల్ మేనేజ్‌మెంట్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థలలో పూర్తిగా 100 శాతం వాటాను పరోక్షంగా కొనుగోలు చేయడం. (బి) వెస్ట్రర్లీ రిటైల్ ప్రయివేట్ లిమిటెడ్ (డబ్ల్యు.ఆర్.పి.ఎల్) (సెలక్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్) ద్వారా) మరియు మమదాపూర్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎం.ఎస్.పి.ఎల్) (ఫ్రైవ్ నెక్సస్ సౌత్ మాల్ మేనేజ్‌మెంట్ ద్వారా) పరోక్షంగా అక్వైరర్ ఆర్ఈఐటీ (దాని మేనేజర్ ద్వారా వ్యవహరిస్తోంది) 100% వాటాను పరోక్షంగా కొనుగోలు చేయడం; మరియు (సీ) ఐటీఐపీఎల్ ప్రస్తుత వాటాదారుల నుండి 50% ఈక్విటీ షేర్లను అక్వైరర్ ఆర్ఈఐటీ (దాని మేనేజర్ ద్వారా చర్య తీసుకోవడం) ద్వారా నేరుగా చేజిక్కించుకుంటుంది. 10 ఆగస్టు 2022 నాటి ట్రస్ట్ డీడ్‌కు అనుగుణంగా, అద్దె లేదా ఆదాయ పోర్ట్‌ఫోలియోను స్వంతం చేసుకోవడం మరియు/ లేదా నిర్వహించడం కోసం, ట్రస్ట్ చట్టంలోని నిబంధనల ప్రకారం, అక్వైరర్ ఆర్ఈఐటీకి సహకార, నిర్ణీత మరియు మార్పులేని ట్రస్ట్‌గా ఏర్పాటు చేయబడింది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ (రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు) నిబంధనలు, 2014 (సవరించినట్లు) ("ఆర్ఈఐటీ నిబంధనలు") ప్రకారం స్థిరాస్తి ఆస్తులను కల్పించి వాటిని కలిగి ఉండడం అనే నిబంధనకు అనుగుణంగా ఈ ప్రక్రియ చేపట్టేందుకు సీసీఐ సమ్మతి తెలిపింది. అక్వైరర్ ఆర్ఈఐటీ 15 సెప్టెంబర్ 2022న రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌గా నమోదు చేయడబడింది. ఆర్ఈఐటీ అందుబాటులో ఉన్న రెగ్యులేషన్స్ కింద రిజిస్ట్రేషన్ నంబర్ ఐఓ/ఖీఇఎం/22-22/0004తో సెబీలో నమోదు చేయబడింది. టార్గెట్ ఎంటిటీలు మరియు టార్గెట్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంటిటీలు ప్రధానంగా భారతదేశంలో వాణిజ్య స్థిరాస్తి రంగంలో నిమగ్నమై ఉన్నాయి. సీసీఐయొక్క వివరణాత్మక ఆర్డర్ వెలువడాల్సి ఉంది.

# ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఫిబ్రవరి 16న న్యూఢిల్లీలోని ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో జాతీయ ఆది మహోత్సవ్ ను ప్రారంభిస్తారు: శ్రీ అర్జున్ ముండా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2023 ఫిబ్రవరి 16న న్యూఢిల్లీ లోని మేజర్ ధ్యాన్ చంద్ జాతీయ స్టేడియంలో జాతీయం ఆది మహోత్సవ్ ను ప్రారంభిస్తారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ అర్జున్ ముండా ఈ రోజు న్యూఢిల్లీలో మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రేణుకా సరుత కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

మహోత్సవ్ లో భాగంగా వివిధ స్టాళ్లలో ప్రదర్శించే ఉత్పత్తుల గురించి ప్రధాన మంత్రికి వివరిస్తారని, గిరిజన సమూహాలకు చెందిన కమ్యూనిటీలకు చెందిన హస్తకళాకారులు , చేతి వృత్తుల వారితో ప్రధానమంత్రి ముచ్చటిస్తారని శ్రీ అర్జున్ ముండా తెలియజేశారు.

ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతను సాకారం చేయడంలో గిరిజన వర్గాల పూర్తి భాగస్వామ్యం, ప్రమేయం ఉండేలా గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోందని మంత్రి తెలిపారు. గిరిజనులు సేంద్రియ ఉత్పత్తుల ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వడం గ్లోబల్ వార్మింగ్ సవాలును ఎదుర్కోవడంలో పెద్ద పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఆది మహోత్సవాల్లో పాల్గొనేందుకు మారుమూల ప్రాంతాల నుంచి తక్కువ తెలిసిన, ప్రత్యేకమైన వస్తువులను తయారు చేసే కళాకారులను మరింతగా ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి తెలిపారు. గిరిజన ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలోకి తీసుకురావడానికి ఆది మహోత్సవ్ ప్రధాన వేదిక అని ఆయన అన్నారు.

గిరిజన ఉత్పత్తుల్లో నాణ్యత, సమకాలీన డిజైన్లను నిర్ధారించడానికి, అదే సమయంలో వాటి సహజత్వాన్ని కాపాడటానికి ట్రైఫెడ్ ఉన్నత స్థాయి డిజైనర్లతో సంప్రదింపులు జరుపుతోందని మంత్రి తెలిపారు.

ట్రైఫెడ్ ఫ్లాగ్ షిప్ ఈవెంట్ ప్రస్తుత ఎడిషన్ "గిరిజన హస్తకళలు, సంస్కృతి, వంటకాలు , వాణిజ్య సమాహార స్ఫూర్తి దాయక వేడుక" ఇతివృత్తాన్ని కలిగి ఉంది, ఇది గిరిజన జీవితాల ప్రాథమిక నైతికతకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

ఈ ఫెస్టివల్ లో గిరిజన హస్తకళలు, చేనేత, పెయింటింగ్స్, ఆభరణాలు, చెరకు, వెదురు, మట్టి వస్తువులు, ఆహారం సహజ ఉత్పత్తులు, బహుమతులు, గిరిజన వంటకాలు మొదలైన ఎన్నో వాటిని 200 స్టాల్స్ ద్వారా ఎగ్జిబిషన్ కం సేల్ లో ప్రదర్శించనున్నారు.

28 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 1000 మందికి పైగా గిరిజన చేతి వృత్తి కళాకారులు, కళాకారులు ఈ ఫెస్టివల్ లో పాల్గొంటారు. ఇందులో 19 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన గిరిజన వంటవారు ఉన్నారు, వారు తయారు చేసే వంటకాల కోసం కోసం 20 ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. చిరుధాన్యాలు గిరిజన సమాజాల ఆహారంలో అంతర్భాగంగా ఉన్నాయి. భారత ప్రభుత్వ ప్రతిపాదన ఆదేశాల మేరకు ఐక్యరాజ్యసమితి 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ఈ సందర్భంగా, గిరిజన చిరుధాన్యాల ఉత్పత్తి వినియోగాన్ని పెంచడానికి, అవగాహన కల్పించడానికి , దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన చేతివృత్తుల వారిని చిరుధాన్యాల (శ్రీ అన్న) ఉత్పత్తులు వంటకాలను ప్రదర్శించడానికి, విక్రయించడానికి ఈ ఉత్సవానికిఆహ్వానించారు.

వాన్ ధన్ ఉత్పత్తుల అమ్మకాలు, ప్రదర్శన కోసం ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 39 వాన్ ధన్ వికాస్ కేంద్రాలు ఈ మహోత్సవ్ లో పాల్గొంటాయి. ఈ ఫెస్టివల్ లోని ఇతర ముఖ్యాంశాలు:

గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల గ్యాలరీ

జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్ సిఎస్ టి) ద్వారా గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల గాథలు, ఎన్ సిజెడ్ సిసి ద్వారా రోజుకు రెండుసార్లు వారి కథలను వినిపిస్తారు.

నేషనల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నాలజీ ఆధారిత జోక్యాలపై వివిధ రంగాలలోనూ, ఇఎంఆర్ఎస్ పాఠశాలల్లోనూ ఉన్నత విజయాలు సాధించిన పూర్వ విద్యార్థుల గురించి సమాచారాన్ని అందిస్తారు. 2023 గణతంత్ర దినోత్సవం సందర్భంగా మొదటి బహుమతి పొందిన గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ శకటాన్ని కూడా ప్రదర్శనకు ఉంచనున్నారు.

గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ట్రైబల్ స్టార్టప్ లతో సహా షెడ్యూల్డ్ తెగలకు అందించబడుతున్న వివిధ పథకాలు , ఆర్థిక సహాయం గురించిఎన్ ఎస్ టి ఎఫ్ డి సి ద్వారా సమాచారాన్ని అందిస్తారు.

తపాలా శాఖ

మారుమూల ప్రాంతాల్లో తమ పథకాలతో పాటు గిరిజన పోస్టల్ స్టాంపుల ప్రదర్శన ను తపాలా శాఖ నిర్వహిస్తుంది.

ఈ కార్యక్రమంలో దేశంలోని సుమారు 20 రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది గిరిజన కళాకారులు గిరిజన ఆచారాలు, పంటలు, పండుగలు, యుద్ధ కళలు మొదలైన వాటి పై గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రదర్శనలు గొప్ప గిరిజన సాంస్కృతిక వైవిధ్యాన్ని ఈ కార్యక్రమంలో చాటి చెబుతాయి.

ప్రధాన నగరాల్లో ఆది మహోత్సవ్ ను నిర్వహించడం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పెద్ద మార్కెట్లలో నేరుగా ప్రవేశానికి గిరిజన కళాకారులకు వరంగా మారింది.

భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ట్రైఫెడ్ సంస్థ పెద్ద మెట్రోలు ,రాష్ట్ర రాజధానులలో గిరిజన చేతి వృత్తుల పురుష, మహిళ కళాకారులకు ప్రత్యక్ష మార్కెట్ ప్రావ్యతను అందించడానికి "ఆది మహోత్సవ్ – నేషనల్ ట్రైబల్ ఫెస్టివల్" ను నిర్వహిస్తోంది.

# కాంగ్రెస్, బీఆర్ఎస్, లెఫ్ట్ పార్టీలు అన్నీ దండుపాళ్యం బ్యాచ్..

## –బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ ఎద్దేవా

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్రౌండ్‌లో లేదని.. అధికారంలోకి రాలేమనీ కాంగ్రెస్ నేతలు అంటున్నారన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఉందని చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఆ పార్టీలో గెలిచిన వారు బీఆర్ఎస్ లోకి వెళ్లారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే గెలిచిన తర్వాత బీఆర్ఎస్‌కు వెళ్తారని ప్రజలు అనుకుంటున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి రాదంటే.. మరి సీఎం కేసీఆర్ బీజేపీని ఎందుకు తిడుతున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, లెఫ్ట్ పార్టీలు అన్నీ కలిసి పోటీ చేస్తాయని అన్నారు. వాళ్లందరూ దండుపాళ్యం బ్యాచ్.. అంటూ ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్‌కు వయసు పెరిగింది... అందుకే ఇంకా ఈటల రాజేందర్ వాళ్ళ పార్టీలో ఉన్నారని అనుకుంటున్నారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ ఢిల్లీ లో మీడియాతో మాట్లాడుతూ ఈసారి తెలంగాణ లో హంగ్ అసెంబ్లీ వస్తుందని జోస్యం చెప్పారు. తమతో కలవాల్సిందే కాబట్టి సీఎం కేసీఆర్ కాంగ్రెస్‌ను పొగుడుతూ.. బీజేపీ ని తిడుతున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ ఒంటరిగా అధికారంలోకి రాదని, మరో పార్టీతో కలవాల్సిందేనని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఏం చేసిందో మేము చెప్పామని, దేశానికి చాలా చేసిందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ మంచి పార్టీ అని, తెలంగాణ ఇచ్చిందని.. మరి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎందుకు కొన్నారని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ సెక్యులర్ పార్టీలని, తాము బీజేపీతో కలిసేదిలేదని స్పష్టం చేశారు. సీనియర్ నేతలు అందరూ కలిస్తే కాంగ్రెస్‌కు 40 నుంచి 50 సీట్లు వస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు

# విద్యార్థుల ప్రాణాలు తీస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలు

## –ఏఐఎస్ బి రాష్ట్ర ప్రధానాకార్యదర్శి గవ్వ వంశీధర్ రెడ్డి



కరీంనగర్, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): హైదరాబాద్ లోని కార్పొరేటు శ్రీ చైతన్య కళాశాల లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నిమ్మల రమాదేవి ఆత్మహత్యకు కారుకులైన శ్రీ చైతన్య యాజమాన్యం పై హత్యాకేసు నమోదు చేయాలని ఆల్ ఇండియా స్టుడెంట్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మట్లాడుతూ.. మార్కులు, ర్యాంకుల కోసం శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తూ ఫలితాలే లక్ష్యంగా మానసిక వేదనకు గురిచేయడం బాదాకరం అని అన్నారు. కార్పొరేట్ కాళాశాలలో వారి లాభం కోసం తప్ప విద్యార్థి సంక్షేమం కోసం పట్టించుకోకుండ వ్యవహరిస్తున్నారని శ్రీ చైతన్య విద్యాసంస్థలో ఇది మొదటి ఆత్మహత్య కాదని, ఇలా ప్రతి సంవత్సరం ఆత్మహత్యల పరంపర కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి కైన ప్రభుత్వం స్పందించి శ్రీ చైతన్య యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థికి న్యాయం చేసేంతవరకు ఏఐఎస్ బి ఆధ్వర్యంలో పోరాటం చేస్తాం అని హెచ్చరించారు. ఈ ఘటనకు కారుకులైన వారిని తక్షణమే గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో విద్యార్థులు మానసికా వేదనకు గురికాకుండా ఉండేందుకు అవగాహన సదస్సును నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐఎస్ బి నాయకులు రమేష్ యాదవ్, హరీష్,వినయ్, విజయ్,వాను తదితరులు పాల్గొన్నారు.

# శాసన మండలి చీఫ్ విప్ గా నియమితులైన భాను ప్రసాద్ రావులు ను కలిసిన ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్ గా నియమితులైన భాను ప్రసాద్ రావు ను మంగళవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి రాజన్న ప్రసాదం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.



# ప్లాటిన్ 2170 జీఎంబీహెచ్ & లాంక్సెస్‌కు చెందిన జేవీ హోల్డ్‌కో అయిన జెన్‌తే ఎల్ఎక్స్ఎస్ జీఎంబీహెచ్‌లోకి లాంక్సెస్ ఏజీకి చెందిన హెచ్‌పీఎం బిజినెస్ సంస్థ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:ప్లాటిన్ 2170 జీఎంబీహెచ్ ఌ లాంక్సెస్‌కు చెందిన జేవీ హోల్డ్‌కో అయిన జెన్‌తే ఎల్ఎక్స్ఎస్ జీఎంబీహెచ్‌లోకి లాంక్సెస్ ఏజీకి చెందిన హెచ్‌పీఎం బిజినెస్‌ను, కొనింకిల్జ్కే జీఎస్ఎం ఎన్.వి.కి చెందిన డీఈఎం బిజినెస్‌ను విలీనం చేయడానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది.

అడ్వెంట్ హోల్డ్‌కోను పరోక్షంగా జీపీఈ ఎక్స్ నియంత్రిస్తుంది, ఇదొక ఫండ్. బోస్టన్‌లో ఉన్న ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడి సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ నియంత్రించే సంస్థలు ఈ ఫండ్ నిర్వహణను చూసుకుంటాయి.

జర్మనీకి చెందిన లాంక్సెస్ ఏజీ పూర్తి యాజమాన్యంలో కొనసాగుతున్న అనుబంధ సంస్థ ఎల్‌డీజీ. 33 దేశాల్లో వ్యాపారం చేస్తున్న ప్రత్యేక రసాయనాల కంపెనీ లాంక్సెస్. ఈ కంపెనీ ప్రధాన వ్యాపారం కెమికల్ ఇండర్మీడియేట్స్, అడిటివ్స్, ప్రత్యేక రసాయనాలు, ప్లాస్టిక్ తయారీ, విక్రయాలు.

జేవీ హోల్డ్‌కో అనేది కొత్తగా స్థాపించిన సంస్థ. ఇది ప్రస్తుతం పూర్తిగా ఎల్‌డీజీ యాజమాన్యంలో ఉంది. హెచ్‌పీఎం బిజినెస్‌ను ఌ హెచ్‌పీఎం బిజినెస్‌ను జేవీ హోల్డ్‌కో ఏకీకృతం చేస్తుంది.

అధిక పనితీరు చూపే థర్మోప్లాస్టిక్ పాలిమర్ల తయారీ, విక్రయాలను హెచ్‌పీఎం బిజినెస్ చేస్తోంది. ప్రస్తుతం కంపెనీల సమూహం ద్వారా ఈ వ్యాపారం జరుగుతోంది. ఇవన్నీ, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎల్‌డీజీ భాగస్వామ్యం కలిగిన అనుబంధ సంస్థలు.

నిర్మాణ సంబంధిత వస్తువులను డీఈఎం బిజినెస్ ఉత్పత్తి చేస్తుంది, విక్రయిస్తుంది. కొనింకిల్జ్కే జీఎస్ఎం ఎన్.వి. గ్రూప్ కంపెనీల్లో ఇది ఒకటి.సీసీఐ నుంచి వివరణాత్మక ఆదేశం రావలసివుంది

# నగరంలో మరిన్ని అభివృద్ధి పనులు .. మంత్రి గంగుల



కరీంనగర్, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ నగరంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ గృహాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించనున్నామన్నారు. స్మార్ట్ సిటీలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, నగరంలో ఐలాండ్ లతో పాటు ఇతర పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కర్నాల్, నగర మేయర్ సునీల్ రావుతో పాటు అధికారులు, కార్పొరేటర్లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# గత ఐదేళ్లలో వేలం ద్వారా 133 ఖనిజ గనులను ప్రైవేట్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వాలు అప్పగించాయి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:సవరించిన 'గనులు ఌ ఖనిజాల (అభివృద్ధి ఌ నియంత్రణ) చట్టం–1957' 12.01.2015 నుంచి అమల్లోకి వచ్చింది. ఖనిజ గనుల లీజులో రాయితీల మంజూరు కోసం పారదర్శకతను తీసుకురావడానికి, అన్ని స్థాయిలలో వివక్షత తొలగించడానికి ఈ సవరణ తీసుకురావడం జరిగింది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గనుల వేలం నిర్వహిస్తాయి. వేలంతో పాటు, ఎంఎండీఆర్ చట్టం–1957లోని సెక్షన్ 17ఏ ప్రకారం ప్రాంతీయ కోటా కింద ప్రభుత్వ కంపెనీలకు ఖనిజ గనుల లీజులో రాయితీలు ఇవ్వడం జరిగింది. గత ఐదేళ్లలో 133 ఖనిజ గనులను వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ కంపెనీలకు అప్పగించాయి. ఎంఎండీఆర్ చట్టం–1957లోని సెక్షన్ 17ఏ ప్రకారం ప్రభుత్వ కంపెనీలకు ప్రాంతీయ కోటా కోసం రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన 16 ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రాల వారీగా, సంవత్సరం వారీగా ఆ వివరాలను అనుబంధం 1లో జత చేయడం జరిగింది.

కేంద్ర 'పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ' నుంచి వచ్చిన సమాచారం ప్రకారం, గత ఐదు సంవత్సరాల్లో గనుల తవ్వకం కార్యకలాపాల కారణంగా మొత్తం 19267.47 హెక్టార్ల అటవీ భూమి మారిపోయింది. ఆ వివరాలు రాష్ట్రాల వారీగా అనుబంధం–ఎఎలో ఇవ్వడం జరిగింది.

మైనింగ్ కార్యకలాపాల కారణంగా నిర్వాసితులైన, పునరావాసం పొందినవారికి సంబంధించిన సమాచారాన్ని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తాయి.

# యువత ఊర్లో కాదు ఉద్యోగంలో ఉండాలి - డాక్టర్ గోలి మోహన్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): గత నవంబరు 12న వేములవాడలో నిర్వహించినటువంటి మెగా జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగం పొందిన అనుపుర గ్రామానికి చెందిన ఎర్రం సంతోష్ అనే యువకుడు మంగళవారం డాక్టర్ గోలి మోహన్ ని కలిశారు ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ నాలాంటి ఎంతోమంది యువకులకు ఉద్యోగాలు ఇచ్చినటువంటి డాక్టర్ గోలి మోహన్ కి యువత అందరూ రుణపడి ఉంటారని ఇలాంటి నాయకుడు ఉన్నప్పుడు మాత్రమే విద్య ఉపాధి ఆర్థిక ఎదుగుదల అనేది మధ్యతరగతి కుటుంబాలకు అందుతుందని తెలిపారు భవిష్యత్ తరాలకు మార్పు జరగాలంటే డాక్టర్ గోలి మోహన్ లాంటి నాయకుడు. మాకు అవసరమని అన్నారు.

అనంతరండాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ యువత ఊర్లో కాదు ఉద్యోగం ఉండాలి అని నా సంకల్పాన్ని యువత అందరూ వినియోగించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు రాబోయే రోజుల్లో కూడా మరికొన్ని మెగా జాబ్ మేళా పెట్టి వేములవాడ నియోజకవర్గంలోని యువతీ యువకులు అందరికీ ఉపాధి అవకాశాలు విద్యా అవకాశాలు కల్పిస్తానని చెప్పారు

# గ్రామ సచివాలయ నిర్మాణాలకు నరేగా నిధుల వ్యయంపై అఫిడవిట్ దాఖలు

## – కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు హైకోర్టు ఆదేశాలు

అమరావతి ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: గ్రామ సచివాలయ నిర్మాణాలకు నరేగా నిధుల వ్యయంపై అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల ఆవరణలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల నిర్మాణంపై విచారణ జరిగింది. గ్రామ సచివాలయాలు పంచాయతీరాజ్ చట్టం పరిధిలో లేవని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. సచివాలయాలు రాష్ట్ర పరిధిలోకి వస్తాయని హైకోర్టుకు ప్రభుత్వం తెలిపింది. గ్రామ సచివాలయ నిర్మాణాలకు నరేగా నిధులు ఎలా వినియోగించారని హైకోర్టు ప్రశ్నించింది. నరేగా నిధుల వినియోగానికి కేంద్రం అనుమతి ఇచ్చిందా అని జస్టిస్ భట్టు దేవానంద్ ప్రశ్నించారు. అలాగే కేంద్రగ్రామీణ అభివృద్ధి శాఖకు ఏమైనా లేఖ రాశారని కోర్టు ప్రశ్నించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

# మోదీని 2002 నుంచి బీబీసీ వెంటాడుతోంది : అమిత్ షా

న్యూఢిల్లీ ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ని బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ 2002 నుంచి వెంటాడుతోందని కేంద్ర హోం మంత్రి, బీజేపీ నేత అమిత్ షా చెప్పారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, అదానీ-హిండెన్‌బర్గ్ నివేదిక వెూదీ-బీబీసీ డాక్యుమెంటరీ వివాదాలపై స్పందించారు.

ఏదైనా అంశంపై వేలాది కుట్రలు జరిగినప్పటికీ సత్యం కచ్చితంగా వెలుగులోకి వస్తుందని అమిత్ షా చెప్పారు. వారు(బీబీసీ) 2002 నుంచి మోదీని వెంటాడుతున్నారని, అయితే మోదీ ప్రతిసారీ మరింత బలపడి, మరింత ప్రజాదరణను పొందుతున్నారని తెలిపారు.

నరేంద్ర వెూదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో (2002లో) గుజరాత్‌లో జరిగిన హింసాకాండపై దేశవిదేశాల్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ హింసాకాండకు సంబంధించిన అంశాలతో డాక్యుమెంటరీని బీబీసీ రూపొందించింది. ఈ డాక్యుమెంటరీని భారత దేశంలో అధికారికంగా ప్రసారం చేయలేదు.

సామాజిక మాధ్యమాల్లో దీనిని ప్రసారం చేయవద్దని, దీనికి సంబంధించిన ట్వీట్లను తొలగించాలని కేంద్ర ప్రభుత్వం జనవరి 21న ఆదేశించింది. ఇది కేవలం ప్రచారాస్త్రమని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది.

ఈ డాక్యుమెంటరీపై నిషేధం విధించడాన్ని ప్రతిపక్షాలు నిరసించాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, ఈ డాక్యుమెంటరీని సమర్థించారు. సత్యం ప్రకాశిస్తుందని తెలిపారు. వెలుగులోకి వచ్చే దురలవాటు సత్యానికి ఉందన్నారు. నిషేధాలు, అణచివేతలు, బెదిరింపులు వంటివేవీ సత్యం బయటపడకుండా, దానిని కప్పిపెట్టి ఉంచలేవన్నారు.

అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక దేశవిదేశాల్లో అల్లకల్లోలం సృష్టించిన సంగతి తెలిసిందే. దీనిపై సంయుక్త పార్లమెంటరీ సంఘం చేత లేదా న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్, టీఎంసీ, బీఆర్ఎస్ వంటి ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వల్లే గౌతమ్ అదానీ అత్యంత వేగంగా అభివృద్ధి చెందారని ఆరోపించారు. ఆయన ప్రసంగంలోని కొన్ని భాగాలను రికార్డుల నుంచి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తొలగించారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసును కూడా జారీ చేశారు.

ఈ వివాదంపై అమిత్ షా స్పందిస్తూ, ప్రభుత్వం దాచవలసినది ఏమీ లేదన్నారు. ప్రస్తుతం దీనిని సుప్రీంకోర్టు విచారిస్తోందని, ఈ సమయంలో దీనిపై తాను మాట్లాడటం ఓ మంత్రిగా తనకు సరికాదని అన్నారు.

అయితే ఈ విషయంలో దాచడానికేమీ లేదని, భయపడవలసినదేమీ లేదని తెలిపారు. రాహుల్ గాంధీ ఏం మాట్లాడాలని అనుకుంటున్నారో ఆయన లేదా ఆయన ప్రసంగాలను రాసేవారు ఆలోచించుకోవాలన్నారు. బీజేపీ క్రోనీ కేపిటలిజానికి పాల్పడుతోందని గాంధీ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ, ఇప్పటి వరకు బీజేపీపై ఇటువంటి ఆరోపణలను ఎవరూ చేయలేదన్నారు. కాంగ్రెస్ పాలనా కాలంలో జరిగిన అవినీతిపై కాగ్ సీబీఐ కేసులను నమోదు చేశాయన్నారు.

డాక్యుమెంటరీపై కేంద్రం నిషేధం

గుజరాత్ అల్లర్లు, మోదీ పాత్రపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని ప్రసారం చేయవద్దని జనవరి 21న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్, 2021 ప్రకారం ఈ అత్యవసర ఆదేశాలను జారీ చేసింది. యూట్యూబ్, ట్విటర్ల నుంచి ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన లింకులు, వీడియోలను తొలగించాలని ఆదేశించింది. ఈ డాక్యుమెంటరీ నిష్పక్షపాతంగా లేదని పేర్కొంది. వలసవాద ఆలోచనా ధోరణి కనిపించిందని పేర్కొంది.

# వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడానికి, అభివృద్ధి చేయడానికి ఎంఎస్ఎంఈ ఛాంపియన్స్ పథకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:దేశంలో ఇంక్యుబేషన్ కేంద్రాల సంఖ్య పెరుగుతోంది. నీతి ఆయోగ్, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్లు (ఏఐసీ) అందించిన సమాచారం ప్రకారం, ఏఐసీల సంఖ్య 2017లోని 13 నుంచి 2022లో 69కి పెరిగింది. దీనికి తోడు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఎంఎస్ఎంఈ ఛాంపియన్స్ పథకం కింద ఎంఎస్ఎంఈ ఆవిష్కరణల పథకాన్ని అమలు చేస్తోంది. వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడానికి, అభివృద్ధి చేయడానికి 2022 మార్చిలో దీనిని ప్రారంభించింది. ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి, వ్యాపార ఇంక్యుబేటర్లుగా పని చేయడానికి 632 హోస్ట్ ఇన్‌స్టిట్యూట్‌లను (హెచ్ఐలు) గుర్తించడం జరిగింది.

గత ఐదు సంవత్సరాల్లో, దేశవ్యాప్తంగా 56 అటల్ ఇంక్యుబేషన్ కేంద్రాలు (ఏఐసీలు), 14 అటల్ సామాజిక ఆవిష్కరణల కేంద్రాలను అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఎయిమ్) ఏర్పాటు చేసింది. గత ఐదు సంవత్సరాలలో స్థాపించిన అటల్ ఇంక్యుబేషన్ కేంద్రాల జాబితా అనుబంధం-ఎలో జత చేయడం జరిగింది.

ఎయిమ్ మార్గదర్శకాల ప్రకారం, అంకుర సంస్థలకు తగిన భౌతిక మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వాటికి మార్గదర్శకత్వం చేయడానికి 5-6 మంది సభ్యుల బృందాన్ని కలిగి ఉండడం, ఆయా రంగాల నిపుణుల అందుబాటును నిర్ధరించడం ప్రతి ఇంక్యుబేషన్ కేంద్రానికి తప్పనిసరి. అటల్ ఇన్నోవేషన్ మిషన్ అనేది మన దేశంలో ఆవిష్కరణలు, వ్యవస్థాపకత సంస్కృతిని ప్రోత్సహించడానికి 2016లో ప్రారంభించిన ఒక కార్యక్రమం. ఈ మిషన్‌లో భాగంగా విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, కార్పొరేట్ సంస్థలు మొదలైన వాటిలో అటల్ ఇంక్యుబేషన్ కేంద్రాల పేరుతో ప్రపంచ స్థాయి ఇంక్యుబేటర్లను ఎయిమ్ ఏర్పాటు చేస్తోంది. నీతి ఆయోగ్ అందించిన సమాచారం ప్రకారం, ఈ కార్యక్రమం ప్రారంభం నుంచి 69 ఏఐసీల ద్వారా 3052 అంకుర సంస్థలు ద్వారా రూపుదిద్దుకున్నాయి. వీటిలో 954 మహిళల నేతృత్వంలోని అంకుర సంస్థలు. ఈ అంకుర సంస్థలు దేశవ్యాప్తంగా 15,506 ఉద్యోగాలను సృష్టించాయి.

# అన్ని 1.56 లక్షల ఆయుష్మాన్ భారత్ - హెల్త్ & వెల్నెస్ సెంటర్లలో ప్రతి నెల 14వ తేదీన ఆరోగ్య మేళాల నిర్వహణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:ఆరోగ్యకరమైన జీవనానికి సంబంధించిన అవగాహనను పెంపొందించడానికి గత సంవత్సరం ప్రారంభించిన "స్వస్థ మన్, స్వస్థ ఘర్" ప్రచారంలో భాగంగా, ప్రతి నెల 14వ తేదీన 1.56 లక్షల ఆయుష్మాన్ భారత్ ? హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ ( ఏబి- హెచ్ డబ్ల్యు సి)లో ఆరోగ్య మేళాలు నిర్వహిస్తారు. దేశం. యోగా, జుంబా, టెలికన్సల్టేషన్, నిక్షయ్ పోషణ్ అభియాన్, నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్ స్క్రీనింగ్, డ్రగ్ డిస్ట్రిబ్యూషన్, సికిల్ సెల్ డిసీజ్ స్క్రీనింగ్ వంటి కార్యకలాపాలు ఈ దేశవ్యాప్త ఆరోగ్య మేళాలలో భాగంగా ఉంటాయి.

దీనితో సమకాలీకరించడానికి, శారీరక, మానసిక శ్రేయస్సు, పర్యావరణ అనుకూలమైన రవాణా గురించి అవగాహన పెంచడానికి, మెరుగుపరచడానికి సైక్లాథాన్, సైకిల్ ర్యాలీ లేదా సైకిల్ ఫర్ హెల్త్ రూపంలో అన్ని ఏబి- హెచ్ డబ్ల్యు సి ల వద్ద 14 ఫిబ్రవరి 2023న సైకిల్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు.

ఢిల్లీలోని లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజీలో 'సైకిల్ ఫర్ హెల్త్' అనే థీమ్‌తో సైక్లాథాన్ నిర్వహించనున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఒక ప్రాంతాన్ని సైకిల్ స్టాండ్‌గా అంకితం చేస్తారు. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా పౌరులందరూ తమ సమీప ఏబి-హెచ్‌డబ్ల్యుసిలో మెగా సైక్లింగ్ ఈవెంట్‌లో పాల్గొనవలసిందిగా కోరారు.

"స్వస్థ మన్, స్వస్థ ఘర్" అనేది నవంబర్ 2022 నుండి అక్టోబర్ 2023 వరకు ఏడాది పొడవునా జరిగే ప్రచారం. ఇది 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' (ఏకేఏఎం) స్మరించుకుంటూ , ఆరోగ్యం ఆరోగ్యం థీమ్‌ను ప్రచారం చేస్తుంది. ఇది నివారణ, ప్రోత్సాహక ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించే కొత్త జాతీయ ఆరోగ్య విధానం, 2017కి అనుగుణంగా ఉంది. ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనాన్ని మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది ఫిట్ ఇండియా ఉద్యమం, 2019.

# గత మూడున్నరేళ్లలో రూ.50 వేల కోట్లకు చేరిన విద్యుత్ డిస్కంల అప్పు

అమరావతి ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: విద్యుత్ డిస్కంల అప్పును జగన్ ప్రభుత్వం గత మూడున్నరేళ్లలో రికార్డు స్థాయిలో రూ.50 వేల కోట్లక చేర్చిందని టీడీపీ నేత పట్టాభి అన్నారు. మంగళవారం విూడియాతో మాట్లాడుతూ.. 2018-19లో కేవలం రూ.18,022 కోట్లుగా ఉన్న డిస్కంల మొత్తం 2022 డిసెంబర్ నాటికి ఆందోళనకరంగా రూ.50,004 కోట్లకు చేరిందన్నారు. చంద్రబాబు హయాంలో 2014-19 ఐదేళ్ల కాలంలో డిస్కంల అప్పు కేవలం రూ.4,188 కోట్లు పెరిగితే నేడు జగన్ హయాంలో మూడున్నరేళ్లలోనే రూ.31,981 కోట్లు పెరిగిందని తెలిపారు. 2014-15లో టీడీపీ హయంలో డిస్కంల అప్పు రూ.13,834 కోట్లు ఉండగా... అది 2018-19 నాటికి కేవలం రూ.18,022 కోట్లకు మాత్రమే చేరుకుందని వెల్లడించారు. కానీ.. వైసీపీ హయంలో ఆ అప్పు కాస్తా 2022 డిసెంబర్ నాటికి రూ.50,004 కోట్లకు చేరి ప్రపంచ రికార్డు సృష్టించిందని ఆయన వ్యాఖ్యలు చేశారు.

అంటే ఐదేళ్ల చంద్రబాబు పాలనలో కేవలం 30 శాతం డిస్కంల అప్పు పెరిగితే జగన్ రెడ్డి పాలనలో డిసెంబర్, 2022 నాటికి 177 శాతం అప్పు పెరిగిందన్నారు. టీడీపీ హయాంలో పైసా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా 24/7 నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తే నేడు ఈ సైకో జగన్ రెడ్డి ఇప్పటికి ఏడుసార్లు ఛార్జీలు పెంచి రూ. 17 వేలకోట్ల భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. ఒక్క యూనిట్ అదనంగా విద్యుత్ ఉత్పాదన పెంచకుంటా నిరంతరం కోతలతో ప్రజలను వేధిస్తూ తీసుకొచ్చిన ఈ రూ.50 వేల కోట్లను దేనికి ఖర్చు చేశావో జవాబు చెప్పాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ని ప్రశ్నించారు. సరాసరిన ఏడాదికి రూ.9,137 కోట్లు, నెలకు రూ.837 కోట్లు విచ్చలవిడిగా డిస్కంల పేరుతో అప్పు చేసి ఎవడికి దోచిపెట్టావో లెక్క చెప్పు పెద్దిరెడ్డి అని నిలదీశారు. "నువ్వు నోరు విప్పకపోతే ఎవరెవరు బినామీలకు ఎంతెంత దోచిపెడుతున్నావో త్వరలో ప్రజల ముందు ఉంచుతా" అంటూ పట్టాభి హెచ్చరించారు. ..

# వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి ధర్మకర్తల మండలి నియామకం



వరంగల్, ఫిబ్రవరి 14: జనగాం జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామం శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానానికి రాష్ట్రప్రభుత్వం ధర్మకర్తల మండలిని నియమించింది. ఈ సందర్భంగా మంగళవారం ధర్మకర్తల మండలి పాలక వర్గ సభ్యులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును పాలకుర్తి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్తకంగా కలిశారు. ఆలయానికి పాలక మండలిని నియమించడంలో చొరవ చూపినందుకు గాను మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ధర్మకర్తల మండలి పాలక వర్గం..

వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ గా వీరమల్ల జైహింద్‌ను నియమించారు. ధర్మకర్తలుగా కేసారపు మల్లారెడ్డి, చెరుకు నరేందర్, పిట్టల సైదులు, వాసూరి శ్రీశైలం, దండేపల్లి రాములు, వాసూరి ప్రమీల భిక్షు, చెరుకు ప్రభాకర్, బేత ఎల్లయ్య, పర్వతి వెంకటయ్యను నియమించారు. సలహాదారులుగా చెరుకు రాములు, వీరమల్ల బాబూరావుల నియమించడం పట్ల మంత్రిని అభినందించారు.

# ఉద్యోగుల సంక్షేమానికి టీటీడీ ప్రాధాన్యం : జేఈవో



తిరుపతి, ఫిబ్రవరి 14: ఉద్యోగుల సంక్షేమానికి, వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని టీటీడీ జేఈవో సదా భార్గవి అన్నారు. మంగళవారం తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్ మైదానంలో ఆమె క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు.

ఉద్యోగులు కోరిన వెంటనే మైదానం అభివృద్ధి కోసం చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి రూ.84 లక్షలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. ప్రస్తుతం క్రికెట్, వాలీబాల్, షటిల్ కోర్టులతోపాటు రిక్రియేషన్ హాల్లో టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్ క్రీడలు ఆడేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

ఆరు నెలల్లో ఇతర క్రీడా పరికరాలను సమకూర్చి, గోడలకు క్రీడాంశాలతో కూడిన చక్కటి పెయింటింగ్ తో మైదానాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో స్నేహలత, ఈ ఈ మురళి ఉద్యోగులు పాల్గొన్నారు. రిక్రియేషన్ హాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ టేబుల్ ను జేఈవో ప్రారంభించారు.

# మహా శివరాత్రి ఏర్పాట్లపై మంత్రి సమీక్ష

వరంగల్, ఫిబ్రవరి 14:మహా శివరాత్రి ఏర్పాట్లపై పాలకుర్తిలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కింగ్, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఉత్సవాలను ఈసారి అంగరంగ వైభవంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా స్నానఘట్టాలు, దర్శనాలు, స్వామి అమ్మవార్ల కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు.

ఈ సందర్భంగా అంశాల వారీగా చర్చించారు. రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. మేడారం జాతర తరహాలో సెక్టోరియల్ అధికారులను నియమించాలని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్‌శాఖ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రద్దీకి అనుగుణంగా బస్ సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. దేవాదాయశాఖ మరింత సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. గతంలో కంటే ఈసారి పాలకుర్తిని ఎక్కువ మంది భక్తులు సందర్శించే అవకాశం ఉందన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో పాలకుర్తి, బమ్మెర, వల్మిడిలను కలుపుకుని అధ్యాత్మిక కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం మంత్రి కలెక్టర్ శివలింగయ్య, అడిషనల్ కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి దేవాలయం, పార్కింగ్ స్థలాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు.

# ఇఎస్ఐఎస్ ఆసుపత్రుల మౌలిక సదుపాయాలను ఆధునీకరించేందుకు నిర్మాణ్ సె శక్తి చొరవను అందించిన ఇఎస్ఐసి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: డిసెంబర్ 2-4, 2022న జరిగిన ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఇఎస్ఐసి - ఉద్యోగుల రాష్ట్ర బీమా కార్పొరేషన్) సమావేశం సందర్భంగా, నిర్మాణ్ సె శక్తి అన్న చొరవ కింద మౌలిక సదుపాయాలను ఆధునీకరించడంపై ఇఎస్ఐసి ఒక ప్రెజెంటేషన్‌ను ఇచ్చినట్టు కార్మిక, ఉపాధి శాఖ మంత్రి శ్రీ రామేశ్వర్ తేలి లోక్‌సభలో వేసిన ప్రశ్నకు లిఖిత పూర్వకరూపంలో సమాధానం ఇస్తూ తెలిపారు. ఈ చొరవలో ఇఎస్ఐ పథకం (ఇఎస్ఐఎస్) ఆసుపత్రులను, డిస్పెన్సరీలను దశలవారీగా ఆధునీకరించడం/ తాజాపరచడం, 100/ 200/ 500 పడకల ఆసుపత్రులను ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసేందుకు ప్రామాణికమైన డిజైన్‌ను రూపొందించడం, ప్రాజెక్టు పర్యవేక్షణ, సూర్‌విజన్ కోసం ఆన్‌లైన్ రియల్‌టైమ్ డాష్‌బోర్డు, నాణ్యమైన నిర్మాణానికి నూతన నిర్మాణ సాంకేతికలను అనుసరించేలా ఖరారు చేయడం, జాప్యాలను , అదనపు ఖర్చును నిర్మూలించడం తదితరాలు, భూమి/ ఆస్తి పత్రాలు తదితరాల డిజిటీకరణ.

ఇఎస్ఐ కార్పొరేషన్ 3-4 డిసెంబర్, 2022న జరిగిన సమావేశంలో అగర్తాలలోని (త్రిపుర) శ్యామ్లిబజార్ లో, ఇడుక్కి (కేరళ)లో నూతన 100 పడకల ఇఎస్ఐసి ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా ఆమోదాన్ని తెలిపినట్టు శ్రీ తెలి అన్నారు. అలాగే, ఇఎస్ఐసి నర్సింగ్ కాలేజీలతో పాటు పిహెచ్.డి, మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (ఎండిఎస్), నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో బీమా చేసుకున్న వ్యక్తుల పిల్లలకు సీట్ల సంఖ్యను చట్టబద్ధమైన ఆమోదం/ అనుమతితో దశలవారీగా పెంచాలని ఇఎస్ఐసి ప్రణాళికను రూపొందించింది.

ఇన్ఐ కార్పొరేషన్ 3-4 డిసెంబర్ 2022న నిర్వహించిన సమావేశంలో మిగుల నిధులలో కొంత భాగాన్ని ఎక్స్‌చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఇటిఎఫ్)కు పరిమితమైన ఈక్విటీలో పెట్టుబడి పెట్టేందుకు సూత్రప్రాయంగా అనుమతినిచ్చిందని లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

# ఆహారధాన్యాల నిర్వహణలో ఆధునిక సాంకేతికతలను ఉపయోగించాలి: శ్రీ గోయల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:ఫుడ్‌గ్రెయిన్ మేనేజ్‌మెంట్ మరియు క్వాలిటీ కంట్రోల్‌లో మరింత పారదర్శకత మరియు కనీస మానవ ఇంటర్‌ఫేస్‌ను తీసుకురావడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజాపంపిణీ, టెక్స్‌టైల్స్ మరియు వాణిజ్యం ఉ పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ లక్నోలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యుపి రీజియన్ కార్యకలాపాలను సమీక్షలో తెలిపారు.

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పనితీరును మరింత సమర్థవంతంగా, ఆధునికంగా మార్చేందుకు అధికారులందరూ తమ సూచనలను పంపాలని ఆయన పిలుపునిచ్చారు. ఆహారధాన్యాల నిర్వహణ రంగంలో తమ నైపుణ్యాన్ని ఉపయోగించాలని మరియు పరిమిత విస్తీర్ణంలో అధిక సామర్థ్యాలను సృష్టించేందుకు గోడౌన్ల మెరుగైన రూపకల్పనను సూచించాలని శ్రీ గోయల్ ఎఫ్‌సిఐ అధికారులను ఆదేశించారు.

గోధుమలు మరియు వరి సేకరణకు సంబంధించిన సమస్యలపై సమీక్షిస్తూ..దాదాపు అన్ని రెవెన్యూ జిల్లాల పరిధిలో ఎఫ్‌సిఐ మరిన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, తద్వారా రైతులు తమ ఉత్పత్తులను ఎఫ్‌సిఐకి లేదా మరేదైనా ఏజెన్సీకి విక్రయించుకునే అవకాశం ఉంటుందని ఆయన ఆదేశించారు.

యూపీలోని కొనుగోలు కేంద్రాల్లో ఈ-పావ్ యంత్రాన్ని ఉపయోగించడం అభినందనీయమన్న మంత్రి రైతుల నుంచి కొనుగోలు విధానంలో మరింత పారదర్శకత తీసుకురావడానికి ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

ఉత్తరప్రదేశ్‌లోని డిమాండ్, జనాభా మరియు విస్తారమైన భౌగోళిక ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకుని, గోధుమల మార్కెట్ ధరలు నియంత్రించడానికి ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్‌లో ఎక్కువ మొత్తంలో గోధుమలను అందించాలని కేంద్ర మంత్రి ఆదేశించారు.

రాష్ట్రంలోని స్టోరేజీ సామర్థ్యాలను సమీక్షించిన సందర్భంగా శ్రీ గోయల్ మాట్లాడుతూ..ఎఫ్‌సిఐకి చెందిన అన్ని గోడౌన్‌ల యాజమాన్య మరియు అద్దె రెండూ అత్యున్నత ప్రమాణాలు కలిగి ఉండాలని తెలిపారు. నాసిరకంగా ఉన్న అన్ని గోడౌన్‌లను తక్షణమే అవసరమైన మరమ్మతులు చేపట్టి అప్‌గ్రేడ్ చేయాలని లేకుంటే నియామకం కోసం పరిగణించాలని స్పష్టం చేశారు.

# పర్యావరణ రక్షణ బాధ్యతగా తీసుకోవాలి

## - రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య

## -ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ కు అభినందన



హైదరాబాద్ ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); పర్యావరణ రక్షణ బాధ్యత ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అన్నారు. ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ బృందం సోమవారం సాయంత్రం ఆర్ కృష్ణయ్య ను కలిసి నంద్త రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్ అందజేసింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ...మనిషి నిర్లక్ష్యం, ఉదాసీనత కారణంగా ప్రకృతి సహజ స్థితి కోల్పోయి విపత్తులకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విపత్తులను నిలువరించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఎన్విరాన్మెంట్ సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్... కౌన్సిల్ గౌరవాధ్యక్షులు ఉప్పల వెంకటేష్ గుప్త, వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీ హెచ్ రంగయ్య, సభ్యులు అవినాష్, సినియర్ పాత్రికేయులు లక్ష్మణ్, టీవీ నటుడు టివి రమణ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగాన్ని జగన్ భ్రష్టుపట్టించారు

## - శాసనమండలి విపక్షనేత యనమల రామకృష్ణుడు

అమరావతి ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: వైద్య రంగాన్ని జగన్ భ్రష్టుపట్టించారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, శాసనమండలి విపక్షనేత యనమల రామకృష్ణుడు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. నాడు - నేడు కింద వైద్య రంగాన్ని ఉద్ధరించినట్టు జగన్ బడాయి కబుర్లు చెబుతున్నారని మండిపడుతున్నారు. మౌలిక సదుపాయాలు లేక నరకకూపాలుగా ప్రభుత్వాస్పత్రులు ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి మాటలకే పరిమితమైన వైద్య రంగంలో విప్లవం రావాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సూదీ, సిరంజీ, జ్వరం బిళ్లలు కరువయ్యాయని అన్నారు. డాక్టర్లు, సిబ్బంది కొరతతో పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. పేదలకు మెరుగైన వైద్యం కోసం టీడీపీ అమలు చేసిన 33 పథకాలకు జగన్ మంగళం పాడారని విమర్శించారు. బిల్లులు పెండింగ్‌తో ఆరోగ్యశ్రీ కింద పేదలకు నెట్ వర్క్ ఆస్పత్రులు వైద్యాన్ని నిరాకరిస్తున్నారని, బిల్లులు పెండింగ్‌తో ఆరోగ్యశ్రీ కింద పేదలకు వైద్యం నిరాకరిస్తున్న నెట్ వర్క్ ఆస్పత్రులు యనమల రామకృష్ణుడు వ్యాఖ్యలు చేశారు.

# భక్తుల సౌకర్యార్థమే టూరిస్ట్ పోలీస్ స్టేషన్ : ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్




అమరావతి, ఫిబ్రవరి 14: మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ప్రాంగణం మధ్య కారిడార్ ప్రత్యేక భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీ టూరిస్టు పోలీస్ స్టేషన్ మంగళవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సులో వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మీడియాతో మాట్లాడుతూ? రాష్ట్ర వ్యాప్తంగా 21 పర్యాటక ప్రాంతాలలో టూరిస్టు పోలీసు స్టేషన్ లు ఏర్పాటు చేశారని, ముఖ్యమంత్రిచే వర్చువల్ విధానంలో ఆవిష్కరణ జరిగిందన్నారు. కర్నూలు జిల్లాలోని మంత్రాలయం శ్రీ మఠంలోని టూరిస్టు పోలీసుస్టేషన్ ను ఆవిష్కరణ చేసి ప్రారంభించామన్నారు. ఈ టూరిస్టు పోలీసుస్టేషన్ లో ఒక ఎస్సై ఆధ్వర్యంలో 7 మంది పోలీసులు రోటేషన్ పద్దతిలో విధులు నిర్వహిసుంటారన్నారు. భద్రత పరంగా సేవలు అందిస్తారన్నారు. ఏదైనా ఆపద, ప్రమాదం జరిగిన సమయాలలో తదితర విషయాలలో అప్రమత్తంగా వ్యవహరిస్తారన్నారు. భద్రతే ప్రధానంగా సేవలందిస్తామన్నారు. వచ్చే పర్యాటకుల భద్రత, సేవా భావంపై దృష్టి సారిస్తామన్నారు. భక్తులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. మంత్రాలయంకు రాఘవేంద్ర స్వామి దర్శనార్ధం సామాన్య భక్తులే కాకుండా ప్రజా ప్రతినిధులు, విఐపిలు అత్యధిక సంఖ్యలో వస్తుండడంలో అత్యధిక భద్రత కల్పిస్తామన్నారు. రాఘవేంద్రస్వామి దర్శనానికి వచ్చే భక్తు లకు పోలీసు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

# బోనాల పండగ విజయవంతమవడం పట్ల హర్షం

### -సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపిన ఐటీఎఫ్ సభ్యులు, కళాకారులు




రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్ (ఐటిఎఫ్) ఉమ్మడి కరీంనగర్ జిల్లా యూట్యూబ్ కళాకారుల ఆధ్వర్యంలో ఈ నెల 5న వేములవాడ పట్టణంలో నిర్వహించిన శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పణ కార్యక్రమం విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్ లో కృతజ్ఞత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేసిన నిర్వాహకులతో పాటు చరిత్రలోనే మొదటిసారి నిర్వహించిన గూగులమ్మ తల్లికి యూట్యూబ్ బోనాల పండగను ప్రారంభం నుండి ముగింపు వరకు విస్తృత ప్రచారం కల్పించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను మేమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐ.టీ.ఎఫ్ గౌరవా ధ్యక్షుడు జి.ఎల్ నామ్ దేవ్, బుర్ర నటరాజ్, మాట్ల తిరుపతి, ఒరుగంటి శేఖర్,మారం పప్పీ, రాజన్న సిరిసిల్ల జిల్లా భాద్యులు జడల రమేష్, మహ్మద్ రఫీ, గణేష్, జగిత్యాల జిల్లా భాద్యులు రాజ్ నరేంద్ర, మహిపాల్, నడిగట్టు రాజు, కరీంనగర్ జిల్లా భాద్యులు బుర్ర సతీష్, ప్రవీణ్, పొద్దుపొడుపు శంకర్, పెద్దపల్లి జిల్లా భాద్యులు సరిత, నరేష్, తిరుపతిలతో పాటు నాలుగు జిల్లాల యూ ట్యూబ్ కళాకారులు పాల్గొన్నారు.

# సైన్స్ టాలెంట్ లో మొదటి స్థానంలో విలాసాగర్ విద్యార్థి



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): , ఫొరమ్ ఫర్ ఫిజికల్ సైన్స్ (ఎఫ్ ఫి ఎస్ టి) బోయిన్ పల్లి మండల వారి ఆధ్వర్యంలో మంగళవారం కొదురుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలాలో 8,9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్ లో విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలాలో 9 వ ,తరగతి చదువుతున్న సాయి శ్రీకరణ్ మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా సాయి శ్రీకరణ్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిట్టపల్లి పర్శరామ్ అభినందించి , ఇందుకు కృషి చేసిన పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ఎం ,రాజిరెడ్డి, ఆర్ ,జగన్ మోహన్ రెడ్డి ని ప్రశంసించారు.

# మహాశివరాత్రి రాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ.



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): రాజన్న ఆలయంలో వైభవంగా నిర్వహించే మహాశివ రాత్రి జాతర కు విచ్చేయు భక్తుల సౌకర్యాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మరియు ఎస్పీ అఖిల్ మహాజన్ కల్సి పరిశీలించారు.వీరి వెంట ఆలయ అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్,ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్ ,డిపిఓ రవీందర్, డిఎస్పీ నాగేంద్ర చారి ,ఆలయ ఈఈ రాజేష్ ఉన్నారు

# క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం : పీసీసీఎఫ్ డోబ్రియాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 14: ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని అటవి శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ రాకేశ్ మోహన్ డోబ్రియాల్ అన్నారు. మంగళవారం దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవి అకాడమీ ఆధ్వర్యంలో అటవీ అధికారుల రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో అవసరమన్నారు.

నిత్యం విధి నిర్వహణలో ఉండే ఉద్యోగులు పనుల నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు వెసులుబాటునిస్తాయని అన్నారు. వివిధ పోటిల్లో పాల్గొంటున్న క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలని కోరారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ క్రీడల్లో పరుగు పందేలు, లాంగ్‌జంప్, వెయిట్‌లిఫ్టింగ్, డిస్కస్‌త్రో, క్యారమ్స్, చెస్, రైఫిల్‌షూటింగ్, బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ వంటి పోటీలను నిర్వహిస్తున్నారు.

రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో చార్మినార్, భద్రాద్రి, రాజన్న, యాదాద్రి, జోగులాంబ, బాసర, కాళేశ్వరం అటవీ సర్కిళ్లకు చెందిన వివిధ జిల్లాల నుంచి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మహోన్నతమైన తాజా శ్వాస మరియు నోటి ఆరోగ్యం అందించే టూత్‌పేస్ట్ రెడ్ బే ఫ్రెష్ జెల్‌విడుదల చేసిన డాబర్




హైదరాబాద్, ఫిబ్రవరి 14: భారతదేశపు సుప్రసిద్ధ సైన్స్ ఆధారిత ఆయుర్వేద కంపెనీ డాబర్ ఇండియా లిమిటెడ్ నేడు తమ టూత్‌పేస్ట్ పోర్ట్‌ఫోలియోను డాబర్ రెడ్ బే ఫ్రెష్ జెల్ ఆవిష్కరణతో విస్తరించినట్లు వెల్లడించింది. ఈ వినూత్నమైన టూత్‌పేస్ట్‌ను ప్రత్యేకంగా వినియోగదారులకు తాజా, ఆరోగ్యవంతమైన నోటి సంరక్షణను అందించే రీతిలో తీర్చిదిద్దారు. డాబర్ ఇప్పుడు తమ డాబర్ రెడ్ బే ఫ్రెష్ జెల్ కోసం విజయ్ దేవరకొండను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. ఈ భాగస్వామ్యం ప్రారంభంగా విజయ్‌దేవరకొండతో ఎట్రాక్షన్ మాగ్నెట్ నేపథ్యంతో ప్రచార చిత్రం విడుదల చేసింది.డాబర్ ఇండియా లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్? మార్కెటింగ్ శ్రీ అభిషేక్ జుగ్రాన్ మాట్లాడుతూ "డాబర్ రెడ్ బే ఫ్రెష్ జెల్ టూత్‌పేస్ట్ విడుదల చేయడం పట్ల చాలా సంతోషంగా ఉన్నాము. ఈ బ్రాండ్‌ను విజయ్ దేవర కొండ ప్రచారం చేయనున్నారు. వింటర్ గ్రీన్ ఆయిల్, మింట్, కలిగిన డాబర్ రెడ్ బే ఫ్రెష్ జెల్ టూత్‌పేస్ట్ క్లీనికల్‌గా 12 గంటల పాటు తాజా దనం అందిస్తుందని, ఆర్డనరీ టూత్ పేస్ట్‌తో పోలిస్తే 4 రెట్ల అధిక తాజాదనం ఇస్తుందని నిరూపితమైంది" అని అన్నారుడాబర్ రెడ్ బే ఫ్రెష్ జెల్ టూత్‌పేస్ట్ 150 గ్రాముల ధర 100 రూపాయలు. అన్ని ప్రధాన రిటైల్ స్టోర్లు, ఈ?కామర్స్ ప్లాట్‌ఫామ్స్ వద్ద లభ్యమవుతుంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ " డాబర్ కుటుంబంలో భాగం కావడం పట్ల సంతోషంగా ఉంది. డాబర్ రెడ్ అత్యంత ప్రతిష్టాత్మకమైన, నమ్మకమైన బ్రాండ్. దీని ప్రొడక్ట్ నాణ్యత, సమర్థత పరంగా ఖ్యాతి గడించింది. డాబర్ రెడ్ బే ఫ్రెష్ జెల్ టూత్‌పేస్ట్ విడుదల చేయడం పట్ల సంతోషంగా ఉన్నాను"అని అన్నారు. హవాస్ వరల్డ్ వైడ్ ఇండియా చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ అనుపమ రామస్వామి మాట్లాడుతూ "యువత కోరుకునే మాగ్నెటిజంను ఈ ప్రచారం ద్వారా వెలుగులోకి తీసుకురావాలనుకున్నాము. ఈ టీవీసీలో విజయ్ దేవరకొండ డాబర్ రెడ్ బే ఫ్రెష్ జెల్ టూత్‌పేస్ట్ శక్తిని వినియోగించుకుని 12 గంటల లోతైన తాజా శ్వాస ఆత్మవిశ్వాసవ అందిస్తుందనే సందేశం వెల్లడించనున్నారు" అని అన్నారు

# ఈసారి తెలంగాణలో హంగ్ అసెంబ్లీ వస్తుంది

### -కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ ఢిల్లీ లో మీడియాతో మాట్లాడుతూ ఈసారి తెలంగాణ లో హంగ్ అసెంబ్లీ వస్తుందని జోస్యం చెప్పారు. తమతో కలవాల్సిందే కాబట్టి సీఎం కేసీఆర్ కాంగ్రెస్‌ను పొగుడుతూ.. బీజేపీ ని తిడుతున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ ఒంటరిగా అధికారంలోకి రాదని, మరో పార్టీతో కలవాల్సిందేనని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఏం చేసిందో మేము చెప్పామని, దేశానికి చాలా చేసిందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ మంచి పార్టీ అని, తెలంగాణ ఇచ్చిందని.. మరి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎందుకు కొన్నారని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ సెక్యులర్ పార్టీలని, తాము బీజేపీతో కలిసేదిలేదని స్పష్టం చేశారు. సీనియర్ నేతలు అందరూ కలిస్తే కాంగ్రెస్‌కు 40 నుంచి 50 సీట్లు వస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. మార్చి మొదటి వారంలో యాత్ర ప్రారంభిస్తానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. తాను స్టార్ క్యాంపైనర్‌నని రాష్ట్రమంతా తిరుగుతానని చెప్పారు. యాదగిరి గుట్ట నుంచి యాత్ర మొదలు పెడతానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కొత్త ఇంఛార్జ్ మానిక్ థాక్రే వచ్చిన తర్వాత పార్టీ పరిస్థితి బాగుందని, పార్టీ గాడిలో పడిందన్నారు. గత ఇంఛార్జ్ అంతా ఫోన్‌లోనే చూసుకునేవారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు.

# దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ: విరుచుకుపడ్డ కాంగ్రెస్ నేతలు

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ ప్రకటించారని కాంగ్రెస్ నేతలు విరుచుకుపడ్డారు. తాజాగా ఢిల్లీ ముంబైలలోని బీబీసీ కార్యాలయాలపై ఐటీ అధికారులు దాడులు(తనిఖీలు మాత్రమేనని వారు చెబుతున్నారు) చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ సహా అన్ని పక్షాల నాయకులు కూడా తీవ్రంగా తప్పుబట్టారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త అదానీ వ్యవహారంలో జేపీసీ ఏర్పాటు చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం బీబీసీ వెనుకాల వడిందని కాంగ్రెస్ విమర్శించింది. ఈ చర్యను దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీగా అభివర్ణించింది. తొలుత బీబీసీ డాక్యుమెంటరీ ప్రసారం చేసింది. అది బ్యాన్ అయ్యింది. ఇప్పుడు బీబీసీపై ఐటీ సోదాలు జరిగాయి. అప్రకటిత ఎమర్జెన్సీకి ఇంతకన్నా ఉదాహరణ ఏముంటుంది? అని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. బీబీసీపై దాడులను కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై డాక్యుమెంటరీ ప్రసారం చేసిన వారాల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడంపై బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ తెలంగాణ అధికార పార్టీ బీఆర్ఎస్ యూపీ ప్రధాన ప్రతిపక్షం సమాజ్వాదీ పార్టీలు మండిపడ్డాయి.

# ప్రపంచ రేడియో దినం సందర్భం లో రేడియోశ్రోత లు అందరికీ అభినందనల ను తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:రేడియో ప్రసారాల ను వినే వారందరికీ, రేడియో జాకీ (ఆర్ జె) లకు మరియు ప్రసార వ్యవస్థ తో ముడిపడి ఉన్న ఇతరుల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రపంచ రేడియో దినం సందర్భం లో అభినందనల ను తెలియజేశారు. 2023 ఫిబ్రవరి 26 వ తేదీ న జరగనున్న 'మన్ కీ బాత్' ('మనసు లో మాట') కార్యక్రమాని కి గాను పౌరులు వారి వారి సూచనల ను వ్యక్తం చేయవలసింది గా కూడా శ్రీ నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు.

"రేడియో ను వినే వారందరికీ, ఆర్ జె లకు మరియు ప్రసార వ్యవస్థ తో అనుబంధాన్ని కలిగి ఉన్న వారందరికీ ప్రపంచ రేడియో దినం విశిష్ట సందర్భం లో ఇవే శుభాకాంక్షలు. కొత్త కొత్త కార్యక్రమాల ద్వారాను, మానవ సృజనశీలత్వాన్ని చాటే మాధ్యం ద్వారా ప్రజల జీవనాన్ని ఇదే మాదిరి గా ప్రకాశింపచేస్తూ ఉండాలి అని కోరుకొంటున్నాను."

"ఈ రోజు న ప్రపంచ రేడియో దినం సందర్భం లో నేను మీ అందరికీ ఈ నెల లో 26 వ తేదీ న జరగవలసి ఉన్నటువంటి చఓజీనినిఐతిఃజీజీబి ('మనసు లో మాట') 98 వ కార్యక్రమం గురించి గుర్తు చేస్తున్నాను. ఆ కార్యక్రమం కోసం మీ మీ సూచనల ను వెల్లడి చేయగలరు. మైగవ్ (ఓఎఉనీల), నమో ఏప్ (ఔజీఓనీ ంజుజూ) లలో మీ అభిప్రాయల ను వ్రాసి గాని, లేదా 1800-11-7800 నంబరు కు డయల్ చేసి మీ యొక్క సందేశాన్ని రికార్డు చేయడం గాని మీ అభిప్రాయాల ను సూచించండి." అని పేర్కొన్నారు.

# బిఆర్ఎస్ నాయకులు శ్రీరామ్ సంజయ్ ని పరామర్శించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.



మహబూబాబాద్, ఫిబ్రవరి 14:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్ అన్న శ్రీరాం సంతోష్ ఈరోజు ఉదయం గుండె పోటుతో మరణించగా, వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరమర్శించారు. మంత్రితోపాటు పాలకుర్తి దేవస్థానం కమిటీ చైర్మన్ వెనుకదానుల రామచంద్రయ్య శర్మ, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య, నాయకులు శ్రీరామ్ సుధీర్, ముత్తినేని శ్రీనివాస్ , వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో అత్యధిక బంగారు పతకాలు



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో అత్యధిక బంగారు పతకాలు సాధించడంపట్ల ప్రత్యేకంగా ఏర్పాటు చేసినటువంటి అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలలో ఎన్నో విషయాలు నేర్చుకునేవి ఉంటాయని ప్రత్యేకంగా విజయాలను సాధించే విధానాలను తెలుసుకుంటామని చెప్పారు. క్రీడల్లో లభించే లాభాలు మరే ఇతర అంశాల్లో సాధ్యం కాదని చెప్పారు. విద్యార్థులకు పోటీతత్వంతో పాటు సత్సంబంధాలు ఏర్పరిచే విధంగా ఉంటాయని తెలుపుతూ ప్రతి విద్యార్థి క్రీడా రంగాల్లో పాల్గొని వాటిలోని విషయాలను సముచితంగా తెలుసుకొని ఉత్తమంగా ఉండాలని వారు సూచించారు. క్రీడల ద్వారా కలిగే విశిష్ట లాభాలవలన పాఠశాల విద్యా ప్రణాళికలో భాగంగా విద్యార్థులను వివిధ పోటలకు ఎంపిక చేయడమే కాకుండా అందులో విజయాన్ని సునాయాసంగా అందుకోవడానికై ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని చెప్పారు.

ప్రాథమికంగా విద్యార్థులకు పాఠశాలలో ఎంపిక పరీక్ష నిర్వహిస్తామని అందులో ప్రతిభ కనబరచిన వారికి పోటీలకు ఎంపిక చేస్తామని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డా॥బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో సూడా చైర్మన్ కరాటే కప్ పేరుతో నిర్వహించినటువంటి అంతరాష్ట్ర కరాటే పోటీలలో నిర్వహించినటువంటి పాఠశాలకు చెందినటువంటి హర్షిని, 7వ తరగతి, మనుకృతి, 8వ తరగతి, లక్ష్మి, 9వ తరగతి, పి. శ్రీనిధి, 9వ తరగతి, ఆర్. వేధిక, 9వ తరగతిలు బంగారు పతకాలు సాధించారని మరియు తదితరులు రజత మరియు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని హర్షం వ్యక్తం చేస్తు భవిష్యత్తులో మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు.

అత్యధిక పతకాలు సాధించడంపట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ విజేతలకు పుష్పగుచ్చాలతో పాటు ప్రశంస పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రిసోర్స్ పర్సన్ గా అవతారమెత్తిన మంత్రి దయాకర్ రావు.

### -నాంచారి మదూరు, పెద్దవంగరలలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.
### -శిక్షణకు క్రమం తప్పకుండా హాజరు కావాలె...
### -మంచి శిక్షణతో.... మంచి ఉపాధి అవకాశాలు...
### -మహిళలకు మంత్రి ఎర్రబెల్లి భరోసా.



మహబూబాబాద్, ఫిబ్రవరి 14:(నేటినిజం ప్రతినిధి): హలో! ఇవ్వాళ శిక్షణకు ఎందుకు రాలే? మీకు బదులు మరొకరి పేరు ఎక్కించాలా? మీ ఎమ్మెల్యే చెప్పిండు. నేను ఇక్కడ శిక్షణ ఇచ్చే వ్యక్తిని మాట్లాడుతున్నాను... అంటూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి కొత్త అవతారం ఎత్తారు. మహిళా సాధికారత లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మరియు స్త్రీ నిధి సహకారంతో రాష్ట్రంలో మొదటిసారిగా పాలకుర్తి నియోజకవర్గంలో 5 కోట్ల 10 లక్షల రూపాయలతో 3 వేల మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా శిక్షణ కొనసాగుతుండగా, మంత్రి ఎర్రబెల్లి ఆయా శిక్షణా కేంద్రాలను స్వయంగా పరిశీలిస్తున్నారు.

ఇందులో భాగంగా తొర్రూరు మండలంలోని నాంచారి మదూరు, పెద్దవంగర మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న మహిళలతో కొద్దిసేపు మాట్లాడారు.

శిక్షణ జరుగుతున్న తీరుని పరిశీలించారు. మహిళల కోరిక మేరకు వారితో ఫోటోలు దిగారు. అలాగే శిక్షణకు గైర్హాజరైన మహిళలతో ఫోన్లో మంత్రి మాట్లాడారు. హలో...! నేను శిక్షణ ఇస్తున్న సార్ ను... మీరు ఇవ్వాళ ఎందుకు రాలేదంటూ ప్రశ్నించారు. మీకు బదులు మరొకరిని పెట్టమని మీ ఎమ్మెల్యే చెప్పారు. మీ మంత్రి ఆదేశించారు అంటూ ప్రశ్నించారు. వారి సమాధానాలు విన్నాక... నేను తెలుసా అంటూ ప్రశ్నించారు. అందరిలోనూ నవ్వులు పూయించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ, శిక్షణకు క్రమం తప్పకుండా హాజరు కావాలని కోరారు. శిక్షణ అనంతరం ఉపాధి, ఉద్యోగావకాశాలకు భరోసా ఇచ్చారు. ఎక్కడా లేని విధంగా చేపట్టిన కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మహిళలను కోరారు.

# భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి

### -జిల్లా విద్యాధికారి రాధా కిషన్
### -కరాటే పోటీల్లో పత కాలు సాధించిన విద్యార్థులను అభినంధించిన జిల్లా విద్యాధికారి



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14: (నేటినిజం ప్రతినిధి): భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ ఆకాంక్షించారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాలలో సందర్శించారు. ఈ సందర్శనలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 12 తేదీన నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో పత కాలు సాధించి న జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం.డి అప్సర్, మణిదీప్ ను అభినందించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చే జిల్లాలో100 పాఠశాలలోని 15000 మంది విద్యార్థినీలకు నెల రోజులపాటు కరాటే శిక్షణ అందిస్తున్నామని అన్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, పి ఈ టి మొయినుద్దీన్, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# నలుగురు ఎర్ర స్మగ్లర్లు అరెస్ట్..

తిరుపతి, ఫిబ్రవరి 14: అన్నమయ్య జిల్లా పరిధిలో బాలపల్లి రేంజ్ లో టాస్క్ ఫోర్స్ అధికారులు మంగళవారం 16 ఎర్రచందనం దుంగలతో పాటు నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వీరి నుంచి ఇన్నోవా వాహనం, ఒక ద్విచక్ర వాహనం 80,000 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఆర్ఐ కృపానంద బృందం అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలో బాలపల్లి రేంజ్ తుని కొండ ఫారెస్ట్ పరిధిలో కూంబింగ్ చేస్తుండగా కొంతమంది ఇన్నోవా కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టి దుంగలతో పాటు ఇన్నోవా కారు హీరో మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని వారి నుంచి రూ.80 వేల నగదును రికవరీ చేశారు. ఈ సందర్భంగా అరెస్టు అయిన వారిలో రైల్వే కోడూరు మండలం నాగోల వెంకటరెడ్డి (31), బొడ్డు శ్రీనివాసుల రెడ్డి(37), మిరియాల నాగేంద్రబాబు (33), ఓబులవారిపల్లె మండలం అరికల మహేంద్ర (26) ఉన్నారు. ఈ మేరకు తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసిన సీఐ చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.